



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 78 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా బుధవారం 1 ఏప్రిల్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 78 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, WED 1 APRIL 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!

ఆసక్తికర వీడియో పంచుకున్న మంత్రి నారా లోకేశ్



- ఏపీ పర్యాటక రంగ ప్రమోషన్‌పై మంత్రి లోకేశ్ దృష్టి
- సోషల్ మీడియా వేదికగా ఆకట్టుకుంటున్న ప్రచార వీడియో
- ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్ అంటూ ఆసక్తికర పోలికలు
- ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాల సంగమం ఏపీ అని ట్వీట్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికరమైన ప్రచార వీడియోను ఆయన పంచుకున్నారు.

- మిగతా2లో

## క్వాంటం అప్లికేషన్లతో ఆంధ్రప్రదేశ్ కే
# తొలి ప్రయోజనాలు

- 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం హార్డ్ వేర్ ఉత్పత్తి లక్ష్యం
- ఏప్రిల్ 14న అమరావతిలో దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ ప్రారంభం
- 2030 నాటికి గ్లోబల్ క్వాంటం హబ్?గా ఏపీని తీర్చిదిద్దేలా ప్రణాళిక
- క్వాంటం హార్డ్ వేర్ తయారీ ఎకోసిస్టంపై సీఎం చంద్రబాబు కీలక రౌండ్ టేబుల్ సమావేశం




పెన్ పవర్ డెస్క్:క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్ల ద్వారా లభించే ప్రయోజనాలను దేశంలోనే తొలిగా అందుకునేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తు సాంకేతికత అయిన క్వాంటం కంప్యూటింగ్‌లో 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్'ను అందిపుచ్చుకోవడం ద్వారా రాష్ట్రానికి అపార అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో 'అమరావతి క్వాంటం వ్యాలీ - క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్' అనే అంశంపై జరిగిన ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న అమరావతి క్వాంటం వ్యాలీ (ఏక్యూవీ), దేశానికే ప్రగతి ప్రేరకంగా నిలుస్తుందని అన్నారు.
ఈ కీలక సమావేశానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీతో పాటు సీడాక్, సీడాట్, డీఆర్‌డీవో, బార్క్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. మూడు దశాబ్దాల క్రితం ఐటీని అందిపుచ్చుకుని హైదరాబాద్‌ను నాలెడ్జ్ ఎకానమీగా మార్చిన స్ఫూర్తితో, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని ఏపీ అభివృద్ధికి చోదకశక్తిగా మలుస్తామని చంద్రబాబు వివరించారు. గతంలో ఐటీ నిపుణుల కోసం ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసినట్లే,

- మిగతా2లో



## ఏపీ రాజధానిగా అమరావతికి
# చట్టబద్ధత...

నేడు లోక్‌సభలో కీలక బిల్లు

- ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధ హోదా
- బుధవారం నాడు లోక్‌సభలో ఏపీ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు
- విభజన చట్టంలోని సెక్షన్ 5కు సవరణ చేయనున్న కేంద్రం
- ఇప్పటికే ఏపీ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం
- జూన్ 2, 2024 నుంచి సవరణ అమల్లోకి వచ్చేలా నిబంధన

- మిగతా2లో

## ఏపీలో చేనేతలకు 'పవర్' గిఫ్ట్... నేటి నుంచే!

- చేనేత మగ్గాలకు 200, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్
- ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పథకం అమలు
- లక్షకు పైగా చేనేత కుటుంబాలకు ప్రత్యక్షంగా లబ్ధి
- పథకం కోసం ఏటా రూ.150 కోట్లు వెచ్చించనున్న ప్రభుత్వం
- ఎన్నికల హామీని నెరవేర్చిన ఎన్డీయే ప్రభుత్వం

- మిగతా2లో



## బందరులో ఒక బఫూన్ ఉన్నాడు



- మంగళగిరి టీడీపీ ఆఫీసులో మంత్రి కొల్లు రవీంద్ర మీడియా సమావేశం
- వైసీపీ నేత పేర్ని నానిపై తీవ్ర విమర్శలు
- మడ అడవులు ఆక్రమించి పేర్ని నాని అక్రమంగా చెరువులు తవ్వారన్న ఆరోపణ
- తప్పు చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టబోమని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు వెల్లడి

- మిగతా2లో

## పవన్ కల్యాణ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డుల పంట..
# 24వ స్థానం నుంచి అగ్రస్థానానికి ఏపీ



- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖకు 5 జాతీయ అవార్డులు
- రెండు విభాగాల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్
- గత ప్రభుత్వ హయాంలో 24వ స్థానం నుంచి మొదటి స్థానానికి ఎగబాకిన ఏపీ
- పల్లెపండుగ, పల్లె వెలుగు వంటి కార్యక్రమాలతో మెరుగైన పనితీరు
- ఈ పురస్కారాలను ప్రకటించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ

- మిగతా2లో

## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

- ప్రపంచ సవాళ్ల మధ్య భారత్ నిలకడగా ఉందని వ్యాఖ్య
- కాంగ్రెస్ వదంతులు వ్యాపింపజేస్తోందని తీవ్ర విమర్శలు
- గుజరాత్‌లోని డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించిన ప్రధాని
- ఈ ప్రాజెక్టు ఆలస్యానికి కాంగ్రెసే కారణమని ఆరోపణ
- దేశ ఐక్యతకు పాటుపడాలని ప్రజలకు పిలుపు




పెన్ పవర్ డెస్క్:ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, భౌగోళిక రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్-థరాడ్‌లో రూ.19,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, కాంగ్రెస్ వదంతులను ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారని మండిపడ్డారు.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. "ప్రపంచంలోని ఎన్నో దేశాలు

- మిగతా2లో

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

మిత్రదేశాలపై ట్రంప్ ఫైర్



- ఇరాన్‌పై దాడులకు సహకరించని మిత్రదేశాలపై ట్రంప్ ఆగ్రహం
- మీ ఆయిల్‌ను మీరే తెచ్చుకోండి అంటూ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్
- అమెరికా నుంచి కొనుగోలు చేయండి లేదా బలవంతంగా తెచ్చుకోండి అని సూచన
- హర్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో పెరిగిన చమురు ధరలు

- మిగతా2లో

## ఒక్కడు... 27 బైకులు చోరీ చేశాడు!

- ప్రకాశం జిల్లాలో ఘరానా దొంగ అరెస్ట్
- 27 బైకులు చోరీ చేసిన వైనం
- చెడు వ్యసనాల కోసమే దొంగతనాలు చేస్తున్నట్లు వెల్లడి
- నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువైన బైకులు స్వాధీనం
- అరెస్ట్ సమయంలో కిలోకు పైగా గంజాయి కూడా పట్టివేత

- మిగతా2లో



పెన్ పవర్ డెస్క్:ఒకటి కాదు రెండు కాదు... ఏకంగా 27 బైకులను ఒక్కడే చోరీ చేశాడు. చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగగా మారిన ఓ వ్యక్తిని ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 27 మోటార్‌సైకిళ్లను, కిలోకు పైగా

## మా పంటలు ఎండిపోతుంటే అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తారా?

ఏపీ ప్రభుత్వంపై మంత్రి జూపల్లి ఆగ్రహం

- శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా ఏపీ విద్యుత్ ఉత్పత్తి చేస్తోందన్న జూపల్లి
- ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేస్తోందని ఆవేదన
- రైతుల హక్కులు కాలరాస్తే ఊరుకోబోమని హెచ్చరిక

- మిగతా2లో



## తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

- ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని వెల్లడి
- గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

- మిగతా2లో



## నేటి నుంచి తెలంగాణలో చికెన్ దుకాణాలు బంద్..

- పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచాలని చికెన్ షాపు యజమానుల డిమాండ్
- ఇటీవల గతంలో కంటే మార్జిన్‌లు తగ్గించారని ఆవేదన
- కిలో చికెన్‌పై రూ.30 మార్జిన్ ఇవ్వాలని డిమాండ్

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# వంట గ్యాస్ సిలిండర్ల కొరత తీరేనా?

మారుమూల పల్లెల నుండి మొదలుకొని పేరు మోసిన పట్టణాల్లో సైతం గ్యాస్ సిలిండర్ల వాడకం విరివిరిగా కొనసాగుతుంది. కానీ ఇప్పుడున్న విపత్కర పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల వాడకదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గ్యాస్ వినియోదారుల అవస్థలు అంత పట్టకుండా ఉండే పరిస్థితులు నేడు దాపరించాయి. ప్రస్తుతం ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతుండడమే వంటగ్యాస్ కొరతకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఈ యుద్ధాల వల్ల గ్యాస్ ఉత్పత్తుల్లో, అంతర్జాతీయ సరఫరా ప్రభావితం అవుతుంది. రష్యా , ఉక్రెయిన్, ఇజ్రాయెల్ వంటి దేశాల నుండి ఖఊ, నాచురల్ గ్యాస్, కొద్దిపాటి పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా క్రమంగా తగ్గిపోతుంది. దీనివల్ల విదేశీ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సరఫరా తగ్గుముఖం పట్టడం వల్ల గ్యాస్ సిలిండర్ డిమాండ్‌పై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. భారతదేశంలో ఒఖఊ గ్యాస్ దిగుమతి ఆధారిత వనరుగా ఉంది. తద్వారా కొన్ని దేశాల నుండి ఒఖఊ గ్యాస్ సరఫరా నిలిచిపోయే ఆస్కారం ఉంది. దీనివల్ల ఒఖఊ గ్యాస్ కొరత గణనీయంగా పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం సామాన్య కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకం గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిస్థాయిలో లేక సతమతమవుతున్నారు. వృద్ధులు, నిరాక్షరాస్యులు ఎలా గ్యాస్ బుక్ చేసుకోవడం తెలియని పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. స్థానిక ఒఖఊ డీలర్ల వద్ద నిల్వలు తగ్గడం వల్ల ఫోన్ లేదా ఆన్లైన్ బుకింగ్ ద్వారా గ్యాస్ సిలిండర్లు అందుబాటులోకి రావడం చాలా కష్టంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కనీసం బుక్ కావడం కూడా ఒక సవాలుగా దాపరించింది. టోల్ ఫ్రీ నెంబర్, ఐవిఆర్ఎస్, యాప్, ఇలా ఎన్నో రకాలుగా ఉన్న ప్రత్యామ్నాయాల ద్వారా కూడా ప్రయత్నం చేసినా బుక్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో కొరత అధికంగా ఉంది అనడంలో ఆశ్చర్యం లేదు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో చాలామంది ప్రజలు మళ్ళీ పూర్వ కాలపు విధానాల ఏర్పాట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. వంట చెరుకు, గోబర్ గ్యాస్, విద్యుత్ వాడకపు సాధనాలను వినియోగిస్తూ వంట చేసుకుంటున్నారు. భవిష్యత్తులో ఒఖఊ మార్కెట్‌పై అనూహ్య ప్రభావాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఇలానే యుద్ధం కొనసాగితే ధరలు అనియంత్రితంగా పెరిగే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో డీలర్ల వద్ద స్టాక్ తక్కువ ఉండడం వలన గ్యాస్ సిలిండర్ల ధర విషయంలో చేతివాటం చూపిస్తున్నారు. వాణిజ్య కేంద్రాలైన హోటల్, రెస్టారెంట్లు, హాస్టల్స్ యాజమాన్యాలతో కుమ్మక్కై గ్యాస్ సిలిండర్లను వారికి నచ్చిన ధరలతో సరఫరా చేస్తూ గృహ వినియోగదారులకు మొండి చేయి చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు చాలా చోట్ల జరుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇలాంటి విషయాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాలను పర్యవేక్షిస్తూ స్టాక్ రికార్డులను పరిశీలించాలి. డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాల వద్ద సామాన్య ప్రజలు తమ పనులను వదులుకొని గంటల తరబడి వేచి ఉండి ప్రాధేయపడిన వారికి సరైన సమాధానం చెప్పే నాధుడు కరువయ్యాడు. ప్రభుత్వ అధికారులు వినియోగదారుల పరిస్థితులను వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణ చేయాల్సిన అవసరం ఉంది. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు నెంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

- మొదటి పేజి తరువాయి

అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సమస్యలతో సతమతమవు తున్నాయి. అయితే, మన విజయవంతమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యత వల్ల భారత్ ఈ పరిస్థితులను అదుపులో ఉంచగలిగింది" అని ఆయన వివరించారు. చిన్న దేశాల నుంచి అగ్రరాజ్యాల వరకు ఇంధన ధరలు 10 నుంచి 25 శాతం పెరిగాయని, కానీ భారత్ మాత్రం ఆ భారాన్ని ప్రజలపై పడనీయడం లేదని తెలిపారు. ఈ వాస్తవాలను కాంగ్రెస్ చూడలేకపోతోందని మోదీ విమర్శించారు. "దేశానికి ఐక్యత అవసరమైన ఈ సమయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ ముందుంది. ధైర్యం చెప్పాల్సిన చోట భయాన్ని, వదంతులను వ్యాపింపజేస్తున్నా రు. రాజకీయ రాబందుల్లా దేశంలో గందరగోళం కోసం ఎదురుచూస్తూ, ఎన్నికల లబ్ధి పొందాలని చూస్తున్నారు" అని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇంధన ధరల విషయంలోనూ ప్రజలను క్యూలలో నిలబెట్టి లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌బేస్ అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశ భద్రతకు ఇది చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగిందని గుర్తుచేశారు. "అప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి గుజరాత్‌పై ఎందుకో ద్వేషం. ఏళ్ల తరబడి ఫైళ్లను తొక్కిపెట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు. మీరు నన్ను ఢిల్లీకి పంపిన తర్వాత ఆ ఫైళ్లను బయటకు తీసి, ఈ ఎయిర్‌బేస్‌ను పూర్తి చేశాను" అని మోదీ తెలిపారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ వైఖరే కారణమని, దేశ భద్రత విషయంలో వారి ప్రవర్తనను జాతి ఎప్పటికీ క్షమించదని అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలు భారత్‌ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని మోదీ ఆరోపించారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే శక్తుల మాదిరిగా కాంగ్రెస్ మాట్లాడుతోందని విమర్శించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చూపిన ఐక్యతను ఇప్పుడు కూడా ప్రదర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర గుజరాత్ అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను భారత్ ఎలా ఎదుర్కొంటుందో చెప్పడానికి నిదర్శనమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు తెచ్చే ఈ వీడియో ఇప్పుడు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రచార వీడియోలో ఏపీలోని పలు సుందర ప్రదేశాలను దేశంలోని ఇతర ప్రముఖ పర్యాటక కేంద్రాలతో పోల్చి చూపించారు. "ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్... సిక్కిం కాదు కైలాసగిరి... సుందర్ బన్స్ కాదు కోరింగ... తమిళనాడు కాదు సింహాచలం... గోవాలోని బాగా బీచ్ కాదు రుషికొండ బీచ్... ఇది కేరళ కాదు కోనసీమ... ఇది ఆంధ్రప్రదేశ్" అంటూ సాగే ఈ వీడియో రాష్ట్రంలోని ప్రకృతి రమణీయతను కళ్లకు కడుతోంది. ఈ వీడియోతో పాటు లోకేశ్ ఒక సందేశాన్ని కూడా పోస్ట్ చేశారు. "పవిత్ర ఆలయాల్లోని మంత్రోచ్ఛారణల నుంచి అంతులేని సముద్ర తీరం వరకు, కాలుష్యానికి దూరంగా ఉన్న కొండల అందాల వరకు ఆంధ్రప్రదేశ్ ఆత్మకు ఓ గొప్ప ప్రయాణం లాంటిది. ఇక్కడ ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాలు అన్నీ ఒకేచోట సంగమిస్తాయి. రండి, ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్‌ను అనుభూతి చెందండి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# ఏపీలో చేనేతలకు 'పవర్' గిఫ్ట్... నేటి నుంచే!

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక కానుక అందించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానుంది. దీని కింద చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు (మరమగ్గాలకు) 500 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయనున్నారు. విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించి, సంక్షోభంలో ఉన్న చేనేత వృత్తికి అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,04,488 చేనేత కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. వీరిలో సుమారు 93,000 చేనేత మగ్గాల కుటుంబాలు, 11,488 పవర్‌లూమ్ కుటుంబాలు ఉన్నాయి. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.150 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ రాయితీ ద్వారా ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి ఏడాదికి రూ.8,640 ఆదా కానుండగా, ఒక్కో పవర్‌లూమ్ యూనిట్‌కు ఏటా రూ.21,600 వరకు ఆర్థిక వెసులుబాటు లభిస్తుంది. ముడిసరుకు, రంగుల అద్దకం, నేత పనులకు విద్యుత్ అత్యవసరం కావడంతో, ఈ ఉచిత సరఫరా వారి ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించనుంది.

ఉచిత విద్యుత్ పథకంతో పాటు, చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం మరిన్ని కీలక చర్యలు చేపట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే నేతన్నలకు ఇచ్చే పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచింది. దీంతో పాటు రూ.5 కోట్ల విలువైన త్రిఫ్ట్ ఫండ్ నిధులను సహకార సంఘాలకు విడుదల చేసింది. ఆధునిక యంత్రాల కొనుగోలుపై 90 శాతం రాయితీ, ముడిసరుకులపై 15 శాతం సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలను అందిస్తోంది. చిన్న తరహా క్లస్టర్ల అభివృద్ధికి రూ.10.44 కోట్లు కేటాయించింది. అంతేకాకుండా, చేనేత ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేర్చేందుకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ వేదికలతో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోంది. తాజాగా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడం ద్వారా చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది.

## ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత...

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకోనుంది. 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) బిల్లు 2026'ను (ఏప్రిల్ 1) బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు ద్వారా 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి సవరణ చేసి, రాష్ట్ర నూతన రాజధానిగా 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చనున్నారు. ఈ బిల్లు ద్వారా పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5, సబ్-సెక్షన్ (2)కు సవరణ చేయనున్నారు. ప్రస్తుతం ఈ సెక్షన్‌లో ఉన్న... 'రాష్ట్రానికి ఒక కొత్త రాజధాని ఉంటుంది' (and there shall be a new capital) అనే వాక్యం స్థానంలో 'అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' (and Amaravati shall be the new capital)... అని చేర్చనున్నారు. అంతేకాకుండా, 'అమరావతి' అనే పదంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఝాజ=ణూ) చట్టం, 2014 ప్రకారం నోటిఫై చేసిన రాజధాని నగర ప్రాంతాలు కూడా కలిసి ఉంటాయని ఈ సవరణలో స్పష్టంగా వివరించనున్నారు. ఈ సవరణ జూన్ 2, 2024 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించనున్నట్లు బిల్లులో పేర్కొనడం గమనార్హం. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని ఏకైక రాజధానిగా నిలబెట్టేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా, మార్చి 28న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పునర్విభజన చట్టంలోని సెక్షన్ 5ను సవరించి 'అమరావతి' పేరును అధికారికంగా చేర్చాలని ఆ తీర్మానంలో కేంద్రాన్ని కోరింది. 2022 మార్చి 3న హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లోని సలహా మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు అసెంబ్లీ తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆమోదించిన ఈ తీర్మానాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు.. రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్, కేంద్ర హోంమంత్రి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఈ బిల్లును తీసుకురానుండడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సవరణ బిల్లుతో ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో నెలకొన్న సందిగ్ధతకు చట్టపరంగా తెరపడుతుందని, అమరావతికి తిరుగులేని చట్టబద్ధ హోదా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

### పవన్ కల్యాణ్ శాఖకు జాతీయ స్థాయిలో అవార్డుల పంట..

## 24వ స్థానం నుంచి అగ్రస్థానానికి ఏపీ

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వం వహిస్తున్న ఈ శాఖకు ఏకంగా ఐదు జాతీయ పురస్కారాలు లభించాయి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, సేవల విస్తరణలో కనబరిచిన అత్యుత్తమ పనితీరుకు గానూ కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఈ అవార్డులను ప్రకటించింది. వివరాల్లోకి వెళితే... రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్, జల్ సంచయ్-జన్ భాగీదారి అనే రెండు కీలక విభాగాల్లో ఏపీ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. మరో విభాగంలో ద్వితీయ స్థానం, ఇంకో రెండు విభాగాల్లో తృతీయ స్థానం దక్కించుకుని మొత్తం ఐదు అవార్డులను కైవసం చేసుకుంది. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని ప్రోత్సహించే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో ఏపీ పనితీరు విశేషంగా మెరుగుపడింది. గత ప్రభుత్వ హయాంలో ఇదే విభాగంలో 24వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ఇప్పుడు దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. అలాగే, తక్కువ ఖర్చుతో వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతులను ప్రోత్సహించే 'జల్ సంచయ్ - జన్ భాగీదారీ' కార్యక్రమంలోనూ ఏపీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణం,

సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సౌకర్యాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 'పల్లెపండుగ 1.0', 'పల్లెపండుగ 2.0' వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.

గ్రామసభలలో వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా 'పల్లెవెలుగు' కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే శాఖ పనితీరు గణనీయంగా మెరుగుపడి, జాతీయ స్థాయిలో ఈ పురస్కారాలు దక్కడం విశేషం.

## బందరులో ఒక బఫూన్ ఉన్నాడు

రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్‌తో పాటు పేర్ని నానిని లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. "బందరులో ఒక బఫూన్ ఉన్నాడు. షాడోలను అడ్డుపెట్టుకుని అక్రమంగా చెరువులు తవ్వించాడు. మడ అడవులను సైతం ఆక్రమించి చెరువులుగా మార్చేశాడు" అని పేర్ని నానిని ఉద్దేశించి కొల్లు రవీంద్ర ఆరోపించారు. అధికారులను బ్లాక్ మెయిల్ చేసి భూములు దోచుకోవడానికి నాని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించవద్దని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు.

### క్వాంటం అప్లికేషన్లతో ఆంధ్రప్రదేశ్ కే

## తొలి ప్రయోజనాలు

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు క్వాంటం నిపుణులను తీర్చిదిద్దేందుకు వైసర్, ఐబీఎం వంటి సంస్థల భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

**'మేడ్ ఇన్ అమరావతి' క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం**

రాబోయే రెండేళ్లలో 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం హార్డ్ వేర్, క్రయోజెనిక్స్, అల్గారిథమ్స్ వంటివాటిని దిగుమతి చేసుకోకుండా, అమరావతి క్వాంటం వ్యాలీలోనే దేశీయంగా ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. 2030 నాటికి ప్రపంచంలోని 5 గ్లోబల్ క్వాంటం హబ్స్‌లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, హార్డ్ వేర్ ఎకోసిస్టంను ఏక్యూవీలో ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌తో పాటు స్టార్టప్‌లు, పరిశోధనలకు అవకాశం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ ప్రణాళికలో భాగంగా, దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్‌ను ఏప్రిల్ 14వ తేదీన అమరావతిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు టెస్టింగ్ కోసం ఈ కంప్యూటర్ అందుబాటులో ఉంటుందని వారు వివరించారు.

క్వాంటం టెక్నాలజీతో అమరావతి భవిష్యత్ నగరంగా, అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా మారుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బృహత్తర లక్ష్య సాధనకు అవసరమైన సాంకేతికత, భాగస్వామ్యం అందించాలని జాతీయ క్వాంటం మిషన్‌ను ఆయన కోరారు.

## తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు, రేపు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి,ద

మెదక్, వికారాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలకు నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హర్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. "అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్‌ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది. ఇక వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినా, ఇరాన్ ఇప్పటికీ హర్మూజ్ జలసంధిపై తన పట్టును కొనసాగిస్తోంది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఇరాన్ దిగ్బంధనం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైంది.

## నేటి నుంచి తెలంగాణలో చికెన్ దుకాణాలు బంద్..

తెలంగాణ రాష్ట్రంలో రేపటి నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పౌల్ట్రీ వాళ్లు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవారని, గత ఇరవై ఏళ్లుగా ఇదే మార్జిన్ ఇస్తున్నారని, ఇటీవల ఈ మార్జిన్ రూ.16కు తగ్గించారని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. కేజీ చికెన్ మార్జిన్ రూ.30 ఇవ్వాలని ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అందుకే మార్జిన్ పెంచే వరకు నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. తక్కువ మార్జిన్ వల్ల వ్యాపారుల జీవనోపాధి సవాల్‌గా మారిందని అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు.

### మా పంటలు ఎండిపోతుంటే అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తారా?

శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే మీరు విద్యుత్ ఉత్పత్తి ఎలా చేస్తారని ఏపీ సర్కారును ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జలాశయంలో నీటి మట్టం తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని జూపల్లి గుర్తు చేశారు. "ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారు. నాడు మేము ధర్నా చేసి, హైకోర్టును ఆశ్రయిస్తే కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇప్పుడు మళ్ళీ అదే పంథాను ఏపీ ప్రభుత్వం అనుసరిస్తోంది" అని ఆయన విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని, రైతుల హక్కులను కాలరాస్తే ఊరుకోబోమని జూపల్లి హెచ్చరించారు. "నీటి కేటాయింపులపై స్పష్టమైన జీవోలు ఉన్నాయి. సమాచారం అందలేదని చెప్పడానికి మీరేమైనా చదువురాని వాళ్లా?" అని ఆయన ఏపీ పాలకులను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిందని, ఏపీ కూడా చట్టప్రకారం నడుచుకోవాలని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవడం వల్లే, ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని జూపల్లి ధ్వజమెత్తారు. ఇప్పటికైనా అక్రమంగా నీటిని తరలించడం ఆపకపోతే.. రైతాంగం, ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సమష్టిగా పోరాటం చేసి తమ హక్కులను కాపాడుకుంటామని ఆయన గట్టి వార్నింగ్ ఇచ్చారు. నీటి వాటాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు.

## ఒక్కడు... 27 బైకులు చోరీ చేశాడు!

- మొదటి పేజి తరువాయి

గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళితే, సోమవారం మధ్యాహ్నం ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి మామిడిపాలెం సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన అద్దేటి ఏడుకొండలు (35) అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని ఆపి తనిఖీ చేయగా, దొంగిలించిన బైక్‌తో పాటు 1.175 కిలోల గంజాయి లభించింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజాలు బయటపడ్డాయి. చెడు వ్యసనాలకు డబ్బు అవసరం కావడంతో బైక్ దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నట్లు ఏడుకొండలు అంగీకరించాడు. ఒంగోలు, మద్దిపాడు, అద్దంకి, వినుకొండ, గుంటూరు, నరసరావుపేట, జి.కొండూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 27 బైకులు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అతని సమాచారం మేరకు పోలీసులు ఆయా బైకులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.12 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిపై గతంలోనూ ఒంగోలు, గుంటూరులో పలు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, సీఐ నాగరాజుతో పాటు ప్రత్యేక బృందంలోని సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, పక్కా ప్రణాళికతో నిందితుడిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# ఏసీబీ కోర్టుకు హాజరైన మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి..





గుంటూరు,పెన్ పవర్, మార్చి, 31. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఆళ్ల రామకృష్ణారెడ్డి పిటిషన్ ను కొట్టేసిన ఏసిబి కోర్టు న్యాయ చరిత్రలో నేడు ఒక చీకటి రోజు ఇన్నర్ రింగ్ రోడ్డు అవినీతి పై 2022లో ఫిర్యాదు చేశా రెండున్నర వేల కోట్ల అవినీతి జరిగింది చంద్రబాబు , లోకేష్ , నారాయణతో పాటు 20 మంది పై సిఐడి ఛార్జి షీట్ కూడా వేసింది ప్రభుత్వం మారగానే చంద్రబాబు ,నారాయణ , లోకేష్ నిజాయితీ పరులైపోయారు ఎవరెవరికి లబ్ధి చేకూరిందో కూడా సిఐడి ఛార్జిషీట్ లో పేర్కొంది ఐఏఎస్ లు 164 స్టేట్ మెంట్ లు ఇచ్చారు కేసు కొట్టివేస్తూ సిఐడి వేసిన రిఫర్ ఛార్జిషీట్ ను కోర్టు అంగీకరించింది అన్ని ఆధారాలున్నా మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్ కింద కోర్టు కేసును కొట్టేసింది ఇప్పటికైనా చంద్రబాబు పోలీసుల పై ఒత్తిడి తేవడం మానుకోవాలి వారి విధులను వారు చేసుకునే అవకాశం చంద్రబాబు కల్పించాలి చంద్రబాబు భయపెట్టి వ్యవస్థలను మీరు చేతుల్లోకి తీసుకోవచ్చు దేవుడి ముందు అందరూ కట్టుబడి ఉండాల్సిందే నిన్న హైకోర్టు నేను వేసిన మూడు కేసులను కొట్టేసింది చంద్రబాబే ఏపీలో పోలీస్ బాస్ గా వ్యవహరిస్తున్నారు ముఖ్యమంత్రి స్థానంలో ఉండి చంద్రబాబు వ్యవస్థలను తన చెప్పుచేతల్లో పెట్టుకున్నారు ఫిర్యాదు దారుడినైన నాకు తప్ప ఎవరికి ప్రశ్నించే అధికారం ఉంది తీర్పు వచ్చిందని చంద్రబాబు సంబరపడిపోతున్నాడు కానీ దేవుడి ముందు చంద్రబాబు చేతులు కట్టుకోక తప్పదు కచ్చితంగా అన్ని కేసుల పై సుప్రీంకోర్టు తలుపు తడతాను..

# వంట గ్యాస్ కొరత లేదు.. ఆందోళన అనవసరం... ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ...



విజయవాడ,పెన్ పవర్, మార్చి, 31. జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదని.. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి గ్యాస్ ఏజెన్సీకి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. జేసీ ఇలక్కియ మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లాలో గ్యాస్ సరఫరా స్థితిగతులపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు చమురు సంస్థలకు సంబంధించి 8,63,778 ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయని.. అదేవిధంగా 18 హెచ్‌పీసీఎల్, 12 బీపీసీఎల్, 26 ఐవోసీఎల్ కు సంబంధించి మొత్తం 56 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 30న 15,186 బుకింగ్స్ జరగ్గా.. ఆ రోజు 19,440 సిలిండర్ల డెలివరీ జరిగిందని వివరించారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డిమాండ్, సరఫరా పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా పెండింగ్ ఎక్కువగా ఉంటే అక్కడ పరిస్థితిని చక్కదిద్దేందుకు సప్లయ్ మేనేజర్లు ద్వారా తగిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అదేవిధంగా గృహ అవసరాలకే కాకుండా వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరా కూడా సోమవారం నుంచి సజావుగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా అవసరముంటేనే గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఎవరూ ఏజెన్సీకి వెళ్లనవసరం లేదని.. డెలివరీ సిబ్బంది ఓటీపీ ఆధారంగా గ్యాస్ సిలిండర్‌ను ఇంటివద్దే అందిస్తారని జేసీ పేర్కొన్నారు.

90 శాతం ఓటీపీ ద్వారానే:

బ్లాక్ మార్కెట్ కు చెక్ పెట్టేందుకు వీలుగా జిల్లాలో దాదాపు 90 శాతం ఓటీపీ ఆధారంగానే సిలిండర్ల డెలివరీ జరుగుతోందని.. ఈ విషయంలో వెనుకబడ్డ కంచికచర్లలోని భాస్కర్ గ్యాస్ ఏజెన్సీకి షోకాజు నోటీసులు ఇచ్చినట్లు వివరించారు. ఎవరైనా బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలకు పాల్పడినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రం (91549 70454) అందుబాటులో ఉందని.. ఫిర్యాదులు, విజ్ఞప్తులను ఈ నంబరుకు కాల్ చేసి తెలియజేయవచ్చని సూచించారు. ప్రస్తుతం ఎల్పీజీ వంట గ్యాస్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అయితే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్తగా ప్రజలు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వినియోగం వైపు మళ్లాలని కోరారు. తక్కువ ఖర్చుతో అధిక భద్రతతో నిరంతర గ్యాస్ సరఫరాకు పీఎన్‌జీ కనెక్షన్లు వీలుకల్పిస్తాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో 10 వేలు మాత్రమే పీఎన్‌జీ కనెక్షన్లు ఉన్నాయని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ వివరించారు. సమావేశంలో డీఎస్‌వో పల్నాటి వాణి, ఏఎస్‌వో వి.శ్రీనివాస్ పాల్గొన్నారు....

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా అంశం కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చేరుస్తాం....



గుంటూరు, పెన్ పవర్, మార్చి, 31. చింతామోహన్, కేంద్ర మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంచలన వ్యాఖ్యలు. కిరణ్ కుమార్ రెడ్డి స్థానంలో దామోదర రాజనర్సింహను ముఖ్యమంత్రి చేసివుంటే దళిత విభజన, రాష్ట్ర విభజన జరిగి వుండేది కాదు. 2029 లో ఎస్సీలు దేశ, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయబోతున్నారు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు దళితుల్ని ముఖ్యమంత్రిని చెయ్యమని సిపియం అగ్రనాయకులు కామ్రేడ్ హరికిషన్ సింగ్ సూర్జిత్ కాంగ్రెస్ హై కమాండ్ కు గట్టిగా సిఫార్సు చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా అంశం కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చేరుస్తాం. రాజ్యాంగ సవరణ చేసి, రిజర్వేషన్లు కల్పిస్తాం. మాదిగలు బైబిల్ పట్టుకున్నంత మాత్రాన బ్రాహ్మణులు కాలేదు. చర్చీలుకు వెళ్లిన ఒక మాలోల్లు కమ్మ, కాపు, రెడ్డి కాలేరు. పేర్లు మార్చుకున్నంత మాత్రాన, మా మాల, మా మాదిగల రక్తం మారదు. సుప్రీం కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ రాజకీయ ప్రేరేపిత జడ్జిమెంట్. బిజెపి కూటమి పాలనలో న్యాయస్థానాల్లో రాజకీయ జోక్యం ఎక్కువైంది. దళితులను బలహీనం చేయాలనే కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది. అందులో భాగంగానే ఏబీసీడీ వర్గీకరణ తీర్పు. ఇప్పుడు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రద్దు వంటి తీర్పులు వచ్చాయి. చంద్రబాబు నాయుడు తొందరపాటుతో ఎస్సీ వర్గీకరణ బిల్లు పాస్ చేశాడు. ఏం సాధించాడు.? ఈశాన్య భారతదేశంలో గిరిజనులు క్రైస్తవ మతం తీసుకుంటే, గిరిజన రిజర్వేషన్లకు అర్హులు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా అంశం తప్పకుండా చేరుస్తాం. రాజ్యాంగ సవరణ చేసి, ఎస్సీ రిజర్వేషన్లు కల్పిస్తాం. ఎస్సీలు 5 వేల సంవత్సరాలుగా అంటరానితనం, సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలుతో నలిగిపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీలకు 15% రిజర్వేషన్లు ఇచ్చింది. విద్యారంగంలో కొంత ప్రగతి సాధించారు. ఆర్థిక రంగంలో బాగుపడ్డది ఐదుపదిమందే. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ కు దళితుల్ని ముఖ్యమంత్రిని చెయ్యమని సిపియం అగ్రనాయకులు కామ్రేడ్ హరికిషన్ సింగ్ సూర్జిత్ కాంగ్రెస్ హైకమాండ్ కు గట్టిగా సిఫార్సు చేశారు.సరైన దళితులకు, సరైన సమయంలో ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లే రాష్ట్ర విభజన జరిగింది. వైఎస్ మరణం తరువాత, కిరణ్ కుమార్ రెడ్డి స్థానంలో దామోదర రాజనర్సింహను ముఖ్యమంత్రి చేసివుంటే, దళిత విభజన, రాష్ట్ర విభజన జరిగివుండేది కాదు. 2029లో ఎస్సీలు దేశ, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయబోతున్నారు.మన విదేశాంగ విధానంలో పొరపాట్లు ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హిట్లర్ లాగా వ్యవహరిస్తున్నారు. ఎన్ డి ఏ ప్రభుత్వం ట్రంప్ కి లొంగిపోయింది.గ్యాస్ సిలిండర్ అందలేదని ఓ మహిళ ఆత్మ హత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ప్రతి ఇంట్లో యుద్ధ ప్రభావం చూపుతోంది. గ్యాస్, పెట్రోల్, డీజిల్ సమస్య విపరీతంగా వుంది. ప్రతి ఒక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి 1991 ఇరాక్, కువైట్ మధ్య యుద్ధం జరిగింది. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గారు, ఢిల్లీ నుంచి మాస్కోకు వెళ్లి, గార్బచేవ్ తో మాట్లాడారు. యుద్ధం విరమించాలని పట్టుపట్టారు. అక్కడి నుంచి టెహ్రాన్ వెళ్లి, ప్రపంచ దేశాల అధినేతలతో మాట్లాడి, ఆ తర్వాత సద్దాం హుస్సేన్ తో మాట్లాడారు. యుద్ధ విరమణ అయ్యేంత వరకు టెహ్రాన్ లో ( ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు 1991) వరకు అక్కడే ఉన్నారు. ఆ తరువాత రాజీవ్ గాంధీ ఢిల్లీకి వచ్చారు. ఇదీ తేడా. అప్పటి ప్రధాని ప్రధాన మంత్రికి ఇప్పటి ప్రధాన మంత్రికి, కాంగ్రెస్ పార్టీ కి, బిజెపికి తేడా. రాజీవ్ గాంధీ ధైర్య సాహసాలు, సమర్థత ఎవరికీ లేదు. ప్రపంచ యుద్ధాన్ని ఆపిన ఘనత చరిత్ర రాజీవ్ గాంధీదే. అమరావతిని రాయలసీమ ప్రజలు అంగీకరించడం లేదు. చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు సఫలీకృతం కాదు. అప్పులు చేసి, అమరావతి లో ఖర్చు చేసి, రాష్ట్ర ప్రజలు నెత్తిన పెనుభారం మోపుతున్నాడు నా మిత్రుడు చంద్రబాబు నాయుడు. ఈ విలేకరులు సమావేశంలో ఎస్సీ నాయకులు అన్నవరపు కిషోర్ పాల్గొన్నారు...

# 9మంది విద్యార్థులకు రూ. 2.94 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగావకాశాలు

గుడ్లవల్లేరు (కృష్ణా) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 31: అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మార్చి 30, 31వ తేదీలలో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్‌లో నిర్వహించిన క్యాంపస్ నియామకాలు జరిగాయి. ఈ డ్రైవ్‌లో ఎఎఎన్ ఎమ్ అండ్ వి వి ఆర్ ఎస్ ఆర్ పాలిటెక్నిక్, గుడ్లవల్లేరు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నియామక ప్రక్రియలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం నుండి ఆరుగురు, మెకానికల్ విభాగం నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికై ఉద్యోగాలను సాధించారు. ఎంపికైన విద్యార్థులకు వార్షికంగా రూ. 2.94 లక్షల వేతనంతో ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ .... "విద్యార్థులు నిరంతరం కృషి చేస్తూ తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటే ఇలాంటి మంచి అవకాశాలు మరింతగా వస్తాయని, అమర రాజా వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ మా విద్యార్థులకు అవకాశాలు కల్పించడం గర్వకారణం" అని తెలుపుతూ, అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ సంస్థ దేశంలో ప్రముఖ ఎనర్జీ సొల్యూషన్స్, ఆటోమొబైల్ బ్యాటరీల తయారీ సంస్థగా పేరు పొందింది. సంస్థ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యత ప్రమాణాలు, సస్టైనబుల్, ఎనర్జీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోంది. భారతదేశంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లలో విశేష గుర్తింపు కలిగిన ఈ సంస్థలో కొలువులు సాధించడం విశేషమని తెలియజేస్తూ, విద్యతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలపై దృష్టి పెట్టడం వల్లే ఇలాంటి మంచి ఫలితాలు మా విద్యార్థులకు సాధ్యమవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కొలువులు సాధించిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విద్యార్థులను, ఈ ప్రాంగణ ఎంపికలు జరగడానికి ముఖ్య కారకులైన ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్స్ ఆఫీసర్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి ఎమ్.వినయ్ ని, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను అందించిన విభాగాధిపతులు, అధ్యాపకులను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వర రావు, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ వల్లూరుపల్లి సత్యనారాయణ రావు, కో -- సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ అభినందించారు.

# నగరంలోని శ్మశానవాటికల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలి....నగర కమిషనర్ కె. మయూర్ అశోక్...





గుంటూరు, పెన్ పవర్, మార్చి, 31. మంగళవారం నగరంలోని కబాడిగూడెం హిందూ శ్మశాన వాటిక, సుద్దపల్లిడొంక లోని క్రిస్టియన్ శ్మశాన వాటిక, ఆనందపేటలోని ముస్లిం శ్మశాన వాటికలలో, పాత గుంటూరు లోని లాల్ జాన్ బాషా పార్క్ నందు మరియు నగరంలోని ప్రధాన రహదారుల్లో పర్యటించి పారిశుధ్య పనులు, వివిధ అభివృద్ధి పనులు చేయుటకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్, ప్రజారోగ్యాదికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో తొలుతగా కబాడిగూడెం హిందూ శ్మశాన వాటిక, సుద్దపల్లిడొంక లోని క్రిస్టియన్ శ్మశాన వాటిక, ఆనందపేటలోని ముస్లిం శ్మశాన వాటికలలో పర్యటించారు. ఈ సందర్భంగా స్మశాన వాటికల్లో పరిశరాలు శుభ్రంగా ఉంచాలని, సదరు ప్రాంతాలలో చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని, అవసరమైతే జే.సి.బి తో పరిశరాలను శుభ్రం చయించాలని ప్రజారోగ్యాదికారులను ఆదేశించారు. కబాడిగూడెం స్మశాన వాటిక నందు లైట్లు, ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్మశాన వాటికనందు గ్యాస్ ద్వారా క్రిమిటోరియం నిర్వహించుటకు అవసరమైన ట్రాన్స్ ఫార్మర్ ను త్వరితగతిన ఏర్పాటు చేయుటకు ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ అధికారులతో మాట్లాడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సుద్దపల్లిడొంక క్రిస్టియన్ స్మశానవాటిక నందు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, ఆనందపేట ముస్లిం స్మశానవాటిక నందు గ్రీనరి అభివృద్ధి చేసి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాత గుంటూరు లోని లాల్ జాన్ బాషా పార్క్ నందు పర్యటించి, పరిసరాలు శుభ్రంగా ఉండాలని పార్క్ కు వచ్చే ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా మొక్కలను నాటి గ్రీనరి అభివృద్ధి చేసి, పార్క్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన డ్రైన్ల లో వ్యర్థాలు పేరుకుపోకుండా నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన మెష్ లను ప్రజారోగ్య అధికారులు ప్రతి రోజు పర్యవేక్షిస్తూ శుభ్రం చేయించాలని, డ్రైన్లలో ఎక్కడా వ్యర్థాలు పేరుకు పోకుండా ప్రజారోగ్యాదికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పర్యటనలో యస్.ఈ జి. వెంకటేశ్వర రావు, డి.ఈ.ఈ హనీఫ్, ఏ.ఈలు, ప్రజారోగ్యాదికారులు, సిబ్బంది పాల్గొన్నారు....

# బాలికలపై జరిగే లైంగిక వేధింపుల నిరోధక చట్టం...సిస్టర్ విద్యా





గుంటూరు, పెన్ పవర్, మార్చి, 31. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు. లో భాగంగా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో ఉన్న మదర్ థెరిసా కిశోర బాలికల గ్రూప్ సభ్యులకు బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల నిరోధక చట్టం 2012 గురించి, బాల్య వివాహాలు వల్ల నష్టాల గురించి, కౌమార దశలో గర్భధారణ వల్ల కలిగే నష్టాల గురించి,ప్రభుత్వ ఉచిత హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిస్టర్ విద్యా. మాట్లాడుతూ, బాలికలపై జరిగే అఘాయిత్యాలు లైంగిక హింస, లైంగిక వేధింపులు, గృహ హింస, మానవ అక్రమ రవాణా, నిర్బంధ బాల్య వివాహాలు,డిజిటల్ వేధింపులు,ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ బుల్లీయింగ్ వంటి అనేక రూపాల్లో దాడులు జరుగుతూనే ఉన్నాయని ఇవి బాలికల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపి, సామాజిక భద్రతకు ముప్పుగా మారుతున్నాయని ఈ సమస్యల నివారణకు కుటుంబం, సమాజం, ప్రభుత్వం సమిష్టిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని లైంగిక వేధింపుల నుండి రక్షణ చట్టం 2012 అనేది వేధింపులకు గురైన బాధితులు తమ హక్కులను కాపాడుకోవడానికి ఒక మార్గాన్ని అందించే చట్టం . ఇది వేధింపులకు గురైన బాధితుల హక్కులను పరిరక్షించడంలో న్యాయస్థానాలకు మరియు పోలీసులకు సహాయపడే విధానాలను ప్రవేశపెడుతుంది అని వేధింపులు స్పష్టంగా కంటికి కనిపించే వాటికి మించి అనేక రూపాల్లో ఉంటాయని అవి కేవలం లైంగిక వేధింపులు మాత్రమే,కాకుండా,వివక్షాపూరిత, మానసిక,శారీరక, ఆన్‌లైన్/సైబర్ వేధింపులు, పని ప్రదేశంలో ప్రతికూల ప్రవర్తన వంటివి కూడా జరుగుతున్నాయని ఇటువంటి నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, 2012 గురించి అందరూ తెలుసుకోవాలి అని అన్నారు. తరువాత అత్తోట పోతురాజు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టంగా, 'లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, 2012' రావటం ,2012 మే 22న లోక్‌సభలో ఈ చట్టం ఆమోదించబడిందని, మన దేశ జనాభాలో 40 శాతం మంది 18 ఏళ్లలోపు వయస్సు పిల్లలు ఉన్నారని బాలలపై శరీర వేధింపులకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాలు లేకపోవడంతో, 2007లో సర్వే చేసిన పిల్లలలో 53 శాతం మందికి పైగా తాము ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రకాల వైద్యం వేధింపులకు గురౌతున్నారని ఈ చట్టంలో నిర్దేశించిన శిక్షలు కూడా కఠినంగా ఉండి,నేరం యొక్క తీవ్రతకు అనుగుణంగా ఉంటాయనీ ప్రభుత్వ ఉద్యోగి వంటి అధికార స్థానంలో ఉన్న వ్యక్తి ఈ నేరానికి పాల్పడితే, ఆ నేరాన్ని తీవ్రమైనది'గా పరిగణిస్తారని తాడేపల్లి మండలంలోని 10 గ్రామాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం, బాల్య వివాహాల నివారణ కోసం,బడిఈడు పిల్లలు ఎవ్వరూ బడి బయట ఉండకూడదనే లక్ష్యంతో తమ సంస్థ పని చేస్తోందని తెలిపారు.అనంతరం నెలటూరి నాగమణి మాట్లాడుతూ, సెల్‌ఫోన్ల వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, వాటి అతివినియోగం బాలికల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, కాబట్టి సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని అన్నారు.అలాగే పిల్లల అక్రమ రవాణా అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న తీవ్రమైన నేరమని, ఇటువంటి ఘటనలు ఎక్కడైనా తెలిసిన వెంటనే 1098 ఉచిత హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చైతన్య బాలల పార్లమెంట్ అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్‌కు చెందిన పిల్లలు, గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు, పి. అనిల్, బి.విజయ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు....

# ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాటలు సిగ్గుచేటు



భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చ్, 31: ప్రముఖ తెలుగు సినీ హీరో లు చిరంజీవి, బాలకృష్ణ,పవన్ కల్యాణ్ లు అందరూ డ్రగ్స్ టెస్టు చేయించుకుంటేనే సినిమాలు విడుదల చేస్తామని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుదురెడ్డి పేర్కొనడం సిగ్గు చేటు అని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కాపు పొలిటికల్ జేఏసీ చైర్మన్ వేల్పూరు శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం భట్టిప్రోలు విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అంతా మొదట డ్రగ్స్ టెస్టు చేసుకుని ఆదర్శంగా ఉండాలని,కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు డ్రగ్స్ మాఫియా కి,రౌడీ లకు,గూండాలు కు సహకరించిన కారణంగా రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉండే అవకాశం ఉందని శ్రీనివాస రావు పేర్కొన్నారు.కొందరు అవినీతి రాజకీయ నాయకులు వల్లే దేశానికి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే అనిరుదురెడ్డి సినిమా పరిశ్రమ ను కించపరిచే వ్యాఖ్యలు చేసిన కారణంగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మిరియాల గ్రామంలో కార్డన్ సేర్చ్ కార్యక్రమం

## సరైన పత్రాలు లేని 35 ద్విచక్రవాహనాలు స్వాధీనం
## గురజాల డిఎస్పీ వెంకటరమణ పర్యవేక్షణలో కార్టన్ సెర్చ్ నిర్వహణ





పెన్ పవర్ కారంపూడి మార్చి 31 :-- నేరాల నియంత్రణకు కార్టన్ సెర్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు కారంపూడి మండలం, మిర్యాల గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, కొన్ని మారణ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గ్రామాలలో వివాదాలకు తావు లేకుండా అన్నదమ్ములలాగా కలిసిమెలిసి ఉండాలన్నారు. గ్రామాలలో నేరాలను పూర్తిగా అరికట్టాలని సూచించారు. అలాగే డ్రగ్స్ కు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు అన్నారు. గ్రామాలలో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. కారంపూడి సర్కిల్ సీఐ శరత్ బాబు , ఎస్ఐ వాసు గురజాల డిఎస్పీ వెంకటరమణ పర్యవేక్షణలో 42 మంది సిబ్బందితో కార్టన్ సర్చ్ నిర్వహించినట్లు తెలిపారు.

# తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పాలిట పెన్నిధి నారా చంద్రబాబు నాయుడు - బీమా చెక్కు అందజేతలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు:

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 31: తెలుగుదేశం పార్టీ అంటే కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు, అది కార్యకర్తల సంక్షేమాన్ని ప్రాణంగా భావించే ఒక గొప్ప కుటుంబం అని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు కొనియాడారు. బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త పరిశా వాణి బాపట్ల మండలం భర్తిపూడి గ్రామానికి చెందిన మనుబ్రోలు వెంకటేశ్వర్లు పిట్టలవాని పాలెం మండలం గోకరాజు నల్లిబోయినవారి పాలెం గ్రామానికి చెందిన నల్లిబోయిన శ్రీనివాసరావు ప్రమాదవశాత్తు మరణించగా, వారికి మంజూరైన రూ. 5 లక్షల ప్రమాద బీమా పత్రాలను మరణించినవారి కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ రాజకీయాల్లోనే ఏ పార్టీ చేయని విధంగా, కేవలం 100 సభ్యత్వంతో 5 లక్షల బీమా సౌకర్యం కల్పించిన ఘనత మన ప్రియతమ నాయకుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కే దక్కుతుంది. కార్యకర్త కష్టంలో ఉన్నా, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినా ఆ



కుటుంబాన్ని రోడ్డున పడనీయకుండా చూసే గొప్ప మానవతావాది ఆయన. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, వారి సంక్షేమం కోసం చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం నేడు చనిపోయిన వారి కుటుంబానికి కొండంత అండగా నిలిచిందని పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని, లోకేష్ బాబు కూడా కార్యకర్తల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం మరియు పార్టీ పరంగా అంకాలు కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తూనే, మరోవైపు కార్యకర్తల సామాజిక భద్రత కోసం ఆలోచించే ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు ని, ఆయన నాయకత్వంలో పనిచేయడం మనందరి అదృష్టమని నరేంద్ర వర్మ రాజు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రముఖులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని చంద్రబాబు నాయుడు కి, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కి కృతజ్ఞతలు తెలిపారు.

# రెవెన్యూ అధికారులు బాధ్యతగా నిబంధనలను ప్రకారం పని చేయాలి

## నిషేధిత జాబితాలో పొరపాటున చేర్చబడిన భూములను గుర్తించి, సరైన ఆధారాలతో త్వరితంగా తొలగించే చర్యలు చేపట్టాలి. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 31: 22 ఏ నిషేధిత భూముల జాబితా లో పెండింగ్ ఉన్న కేసులను వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోదకుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వి సి హాల్ నందు 22ఏ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించే ప్రక్రియపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 22 ఏ నిషేధిత భూముల జాబితా లో పెండింగ్ ఉన్న కేసులను వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల తహశీల్దార్లను ఆదేశించారు. నిషేధిత జాబితాలో పొరపాటున చేర్చబడిన భూములను గుర్తించి, సరైన ఆధారాలతో త్వరితంగా తొలగించే చర్యలు చేపట్టాలి. నిషేధిత భూముల జాబితా నుంచి పట్టా భూములను తొలగించడం, భూమి యజమానులకు హక్కు కల్పించాలన్నారు. గతేడాది జూన్ నుంచి ఇప్పటివరకు 410 అర్జీలు వచ్చాయన్నారు. అందులో 44 అర్జీలకు సంబంధించిన భూములను తొలగించి, భూమి యజమానులకు యాజమాన్య హక్కు కల్పించామన్నారు. ఇ-భూమి, వెబ్ ల్యాండ్, వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో రెవిన్యూ దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు వందలాది ఎకరాల భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించామన్నారు. గత ఐదేళ్లుగా పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం పరిష్కరిస్తున్నామన్నారు. దశలవారీగా 22ఏ సమస్యలన్ని పరిష్కరిస్తామన్నారు. వారంలో రెండు పర్యాయాలు జిల్లా స్థాయి కమిటీ సమావేశమై పరిశీలన, విచారణ చేపట్టాలని ప్రజలు చేసుకుంటున్నామన్నారు రెవెన్యూ అధికారులు బాధ్యతతో నిబంధనలను అనుసరించి పక్కాగా పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందనే



విషయంగుర్తుంచుకోవాలన్నారు. మీకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. మండలాల వారిగా ఉన్న సమస్యల పై చర్చించారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. ఇంకా కొన్ని మండలాలలో పూర్వ జిల్లాలు అయినటువంటి గుంటూరు, ప్రకాశం జిల్లా ల పేర్లు ఉన్నాయని వెంటనే తొలగించి బాపట్ల జిల్లా పేరు వ్రాయాలని మండల తహశీల్దార్లు ను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి కమిటీలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, చీరాల,బాపట్ల ఆర్డీఓలు చంద్రశేఖర్, బి.శ్రీదేవి,రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మరియు అనుబంధ శాఖల అధికారులు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసులలో బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి కలెక్టర్:

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి31:అట్రాసిటీ కేసుల్లో బాధితులకు చెల్లించవల్సిన పరిహారం, ఉద్యోగాలు, ప్రత్యేక పింఛన్లు సమయానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో లేవనెత్తిన సమస్యల పరిష్కారంపై పురోగతిని పరిశీలించిన కలెక్టర్, జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రస్తావించిన అంశాలను శ్రద్ధగా విన్నారు. బాధిత కుటుంబాలకు అందాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రత్యేక పింఛన్ల అంశాలపై ప్రత్యేకంగా చర్చించి, ఇప్పటికే కొన్ని కేసుల్లో పింఛన్ల మంజూరు పూర్తయ్యిందని తెలిపారు. మిగిలిన కేసుల్లో కూడా ఆలస్యం లేకుండా పరిష్కారం చూపించాలని అధికారులకు సూచించారు. అలాగే ఏప్రిల్ నెల నుంచి




ఎస్సి,ఎస్టి ప్రాంతాల్లో నెలకు ఒకసారి పర్యటనలు నిర్వహించి, స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సింగయ్య, చీరాల, రేపల్లె ఆర్డీవోలు చంద్రశేఖర్, శ్రీదేవి, డీఎంహెచ్వో విజయమ్మ , పోలీస్ అధికారులు అధికారులతో పాటు కమిటి సభ్యులైన అధికారులు ,స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు వేము భగవాన్ దాస్, ఆల్ఫ్రెడ్ రాజా సువి సల్మాన్, మిల్టన్ లూథర్ శాస్త్రి, కే వెంకట ప్రసాద్, డి. పోతురాజు పాల్గొన్నారు.

# గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

## ప్రస్తుతం గుర్తించిన 74 హాట్ స్పాట్ లలో పోలీసుల నిఘా ఉంచాం
## డ్రగ్స్ రహిత సమాజం కొరకు అధికారులు నిరంతరం కృషి చెయ్యాలి
## జిల్లా ఎస్పీ శ్రీ బి.ఉమామహేశ్వర్







పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 31: మాదకద్రవ్యాల నియంత్రణ సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించారు డ్రగ్స్ వద్దు ఈగల్ క్లబ్స్ అంటూ అధికారులు రూపొందించిన ప్రత్యేక ప్రచార బోర్డులను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి విడుదల చేశారు గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా బాపట్లను చేయాలని కలెక్టర్ సూచించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగాలు ఎట్టి పరిస్థితిలో జరగడానికి వీలు లేదన్నారు. మత్తు పదార్థాలను సమూలంగా అరికట్టాలన్నారు. ఈగల్ క్లబ్స్ మాదిరిగా 100 మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలలో ప్రహరీ క్లబ్ లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకంగా వెబ్ సైట్ రూపొందించి వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. తద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు అవగాహన కార్యక్రమాలు యువతను చైతన్య పరచడంతోనే మాదకద్రవ్యాలను నియంత్రించగలమన్నారు. మంచి సమాజ నిర్మాణం కొరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. బాపట్ల రైల్వే స్టేషన్ మీదుగా 120 రైళ్లు ప్రతిరోజు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ప్రతిరోజు రైల్వే, బస్సు స్టేషన్లలో నిఘా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి బ్లాక్ స్పాట్ లుగా గుర్తించిన ప్రాంతాలలో విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మాదకద్రవ్యాలకు విద్యార్థులు, యువత ప్రభావితం గాకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందన్నారు నషా ముక్త్ భారత్ లక్ష్యంతో పోలీసు అధికారులు సమర్థంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కొరకు అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు. శక్తి బృందాలు, ఈగల్ బృందాలు మరింత చురుకుగా వ్యవహరించాలన్నారు. మొదటి విడతలో చేపట్టిన అవగాహన ప్రచార కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. ఇదే మాదిరిగా రెండో విడతలోను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందు కొరకు సమగ్ర ప్రణాళిక రూపొందించామన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం పూర్తిగా అరికట్టడానికి విద్యా, వైద్య ఆరోగ్యశాఖలతోపాటు ఆర్ పి ఎఫ్, రవాణా శాఖ వంటి అనుబంధ శాఖల అధికారులు తమ సహకారం అందించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ సమయంలో సచివాలయాల స్థాయి వెల్ఫేర్ సెక్రెటరీ, మహిళా పోలీసులు గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. అవగాహన కార్యక్రమాలతోనే గంజాయి, మాదకద్రవ్యాల భారిన పడకుండా ప్రజలను కాపాడవచ్చన్నారు. గంజాయి ప్రభావానికి యువత గురికాకుండా కళాశాలలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం గుర్తించిన 74 హాట్ స్పాట్ లలో పోలీసుల నిఘా ఉంచామన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై ఏదైనా అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులు ఉన్నట్లు అధికారులు గుర్తిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు ఈ సమావేశంలో బాపట్ల, చీరాల డీఎస్పీలు పి.జగదీష్ నాయక్, ఎండి.మోయిన్, చీరాల ఆర్డీవో టి చంద్రశేఖర్, ఈగల్ సెల్ సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యడ్లపాడులో ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

## ఏడు వాహనాలు స్వాధీనం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 31: యడ్లపాడు : మండలంలో వరుసగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని యడ్లపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు మూడు లక్షల రూపాయల విలువైన ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శిక్షణ ఉప పోలీసు అధికారి జయకృష్ణ ఆదేశాల మేరకు యడ్లపాడు ఉప నిరీక్షకుడు శివరామకృష్ణ మరియు సిబ్బంది మంగళవారం ఉదయం తనిఖీలు చేపట్టారు. మండల పరిధిలోని ఎన్ఎస్ఎల్ వస్త్ర పరిశ్రమ సమీపంలోని సేవా మార్గంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతను నడుపుతున్న ద్విచక్ర వాహనం వివరాలపై విచారణ జరపగా, దొంగతనాలకు పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు తాడికొండ మండలం పాములపాడు గ్రామానికి చెందిన గుడిమెట్ల సాగర్ బాబు (33)గా గుర్తించారు. అతనిపై




తాడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీ షీట్ నమోదై ఉంది. తనిఖీ సమయంలో మరో దొంగతనం చేయాలనే ఉద్దేశంతో తిరుగుతున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడు.

స్వాధీనమైన వాహనాలు:

మూడు యూనికాన్ వాహనాలు, ఒక హెచ్ఎఫ్ డీలక్స్, ఒక షైన్, ఒక ఎక్సెల్, ఒక స్ప్లెండర్ ప్లస్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ మూడు లక్షల రూపాయలకు పైబడినట్లు పోలీసులు అంచనా వేశారు. ఈ సందర్భంగా శిక్షణ ఉప పోలీసు అధికారి జయకృష్ణ మాట్లాడుతూ, వాహనదారులు తమ వాహనాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనపై యడ్లపాడు పోలీసు స్టేషన్‌లో 2026 సంవత్సరానికి చెందిన 49వ నేరంగా భారత న్యాయ సంహిత 303 (2) ప్రకారం కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# ఎలక్షన్ డిటీ జేమ్స్ దంపతులకు ఘన సత్కారం.

భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 31: విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందే విధంగా పనిచేసిన డిప్యూటీ తాసిల్దారు జేమ్స్ పాల్ అభినందనీయుడని తాసిల్దార్ సుశీల పేర్కొన్నారు మండల తాసిల్దార్ కార్యాలయంలో ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేస్తున్న ఆర్ జేమ్స్ పాల్ మంగళవారం పదవీ విరమణ పొందారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డిప్యూటీ తాసిల్దార్ రవీంద్రబాబు అధ్యక్షతన జేమ్స్ పాల్ దంపతులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సత్కరించారు తాసిల్దార్ సుశీల వారిని ఘనంగా సత్కరించారు ఆయన సేవలను కొనియాడారు కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, శ్రీజ, తేజస్వి,



శ్రీనివాసరావు, మండల సర్వేయర్ ఆలీ, వీఆర్వోలు, విఎస్ ఏ లు ఇతర సిబ్బంది పాల్గొని జేమ్స్ పాల్ ను సన్మానించి వీడ్కోలు తెలిపారు.

# చల్లపల్లి పోలీస్ స్టేషన్లో లో పోలీసుల చేతిలో పేలిన టపాసులు

## ఎస్పై తో సహా పలువురు స్టేషన్ సిబ్బందికి తీవ్ర గాయాలు








పెన్ పవర్ రిపోర్టర్ మార్చి 31 కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్లో బీభత్స ఘటన చోటు చేసుకుంది గతంలో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని కోర్టులో సబ్మిట్ చేయాల్సి ఉండగా ఈ క్రమంలో మంగళవారం ఉదయం టపాసులను కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లా బయటకు తీసుకురాగా, ఫోటోలు తీద్దామని అనుకునే సమయంలో ఒక్కసారిగా టపాసులు పేలడంతో భారీ శబ్దం వినబడింది. కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లాకు తీవ్ర గాయాలు పాలు అయ్యారు చల్లపల్లి  ఎస్ఐ దుర్గాంజనేయులుకు స్వల్ప గాయాలయ్యాయి హెడ్ కానిస్టేబుల్ తేజ డ్రైవర్ నాగరాజుకు సైతం గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు అబ్దుల్లాకు తీవ్ర గాయాలు కాగా, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని వారు ఒకేసారిగా  భయభ్రాంతులకు గురయ్యారు  స్టేషన్ వద్దకు చేరుకున్నారు పోలీస్ స్టేషన్లో ఉన్న మహిళా కానిస్టేబుల్, మరో హోంగార్డుకు చిన్న గాయాలతో  ఊపిరి పీల్చుకున్నారు పేలుడు దాటికి పోలీస్ స్టేషన్లో ఉన్న భవనం స్లాబు హెచ్చులు ఊడాయి తలుపులు సైతం పగిలిపోయాయి స్టేషన్లో ఉన్న వాహనం అద్దాలు పూర్తిగా దెబ్బతిన్నాయి వాహనం ఒకపక్క రెండు డోర్లు  దెబ్బతిన్నాయి సుమారు అర కిలోమీటర్ దూరం శబ్దం వినపడడంతో పరిసర ప్రాంతాల వారు హుటాహుటిన పోలీస్ స్టేషన్ కు వచ్చారు అబ్దుల్లాకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించడం జరిగింది ఎన్నడూ లేని విధంగా చల్లపల్లి పోలీస్ స్టేషన్ లో ఈ ఘటన జరగడంతో భయాందోళనకరమైన పరిస్థితి నెలకొందిచల్లపల్లిలో ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ చల్లపల్లిలో సీజ్ చేసిన టపాసులు పేలాయి చల్లపల్లి పోలీస్ స్టేషన్ లో జరిగిన బాణాసంచా పేలుడు ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు చల్లపల్లి పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఉదయం బాణసంచా పేలుడు ఘటనలో పోలీస్ సిబ్బంది గాయపడ్డారు. దీపావళి సందర్భంగా సీజ్ చేసిన మందు గుండు సామాగ్రిని కోర్టుకు తీసుకువెళ్లే నేపథ్యంలో అకస్మాత్తుగా పేలాయి. ఈ ఘటనలో పోలీస్ స్టేషన్ ఎస్ఐ దుర్గా ఆంజనేయులు తో పాటు మరో నలుగురు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయివిషయం తెలుసుకున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హుటాహుటిన చల్లపల్లి చేరుకుని కీర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీస్ సిబ్బందికి అందుతున్న చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు కొంతమందిని మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారుఅనంతరం పోలీస్ స్టేషన్ కు చేరుకుని ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు చల్లపల్లి, అవనిగడ్డ సిఐలు గాజుల యువకుమార్, కె ఈశ్వరరావు, ఎస్ఐలు పాల్గొన్నారు

# నరసరావుపేటలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై ఉక్కుపాదం

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు : ట్రాఫిక్ సిఐ లోకనాథం హెచ్చరిక.

నరసరావుపేట పెన్ పవర్ మార్చి 31: నరసరావుపేట పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ మరియు రహదారి భద్రతలో భాగంగా మంగళవారం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్ ) నిర్వహించారు. ట్రాఫిక్ సిఐ లోకనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన వైఖరి అవలంబించారు. ఈ సందర్భంగా సిఐ లోకనాథం మాట్లాడుతూ ప్రధానాంశాలను వెల్లడించారు:  మార్జిన్ నిబంధనలు: వ్యాపారస్థులు తమ దుకాణాల ముందు కేటాయించిన మార్జిన్ లోపలే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవాలన్నారు. రోడ్ల పైకి వస్తువులను ప్రదర్శించడం వల్ల సామాన్య ప్రజలకు, వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లకు నోటీసులు: నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న పలు హోటళ్లను గుర్తించి, వారికి ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. తదుపరి ఉల్లంఘనలకు పాల్పడితే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. తోపుడు బండ్లు / వాహనదారులు: తోపుడు బండ్ల వారు నిర్దేశించిన ప్రాంతాల్లోనే ఉండాలని, రోడ్ల మధ్యలో నిలపడం వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందని పేర్కొన్నారు. వాహనదారులు కూడా పార్కింగ్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు.



నరసరావుపేట పట్టణాన్ని ట్రాఫిక్ రహిత మరియు సురక్షిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సిఐ కోరారు. నిబంధనలను బేఖాతరు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు.

# చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్...





గుంటూరు, పెన్ పవర్, మార్చి, 31. ప్రతి ఒక్కరూ సమాజసేవలో తమ వంతు భాగస్వాములు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం గుంటూరులో వివిధ కార్యక్రమాలలో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. తొలుత కోర్టు ప్రాంగణంలో జనసేన నాయకులు దార్ల మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. వేసవికాలంలో మజ్జిగ, మంచి నీరు పంపిణీ చేయడం మంచి విషయమని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రజల కోసం చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం కాకాని రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి కాంప్లెక్స్, సంగడిగుంటలోని రెడ్ల రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యేల పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్వయంగా అన్నదానం చేశారు. శ్రీరామచంద్రమూర్తి పరిపాలన అన్నియుగాలకు ఆదర్శమని చెప్పారు. ఆయన ధర్మం సత్యం మార్గాన్ని అనుసరిస్తే జీవితం ఆనందకరంగా మారుతుందని పేర్కొన్నారు...

# సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 31: ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన బాపట్ల మండలం సూర్యలంక బీచ్ ముఖచిత్రాన్ని మార్చే విధంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు  నేడు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న సివిల్ మరియు సుందరీకరణ పనుల నాణ్యతను తనిఖీ చేశారు ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో పర్యాటక శాఖ, రెవెన్యూ, పంచాయితీ రాజ్, ఫారెస్ట్ శాఖల ఉన్నతాధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రేపు 7676 మందికి పెన్షన్లు పంపిణీ

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 31: కర్లపాలెం మండల పరిధిలో ఉన్న 20 గ్రామపంచాయతీలో రేపు ఉదయం పెన్షన్ దారులకు పెన్షన్ అందిస్తున్నామని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేపు సచివాలయం సిబ్బంది మీ ఇంటి దగ్గరికి వచ్చి ఉదయం 6 గంటలకు అల్లా అందరికీ పెన్షన్లు అందిస్తారని ఆయన తెలిపారు. ఈ పెన్షన్లు పంపిణీ చేయడానికి మండలంలో 160 మంది సచివాలయం సిబ్బంది నియమించినట్లుగా ఆయన తెలిపారు.



మొత్తం 7676 పెన్షన్ దారులకు 3 ,32,30,500 కోట్లు మండలంలో పెన్షన్లు పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు.

# మాటలు మీవి  పనులు మావి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి కి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కౌంటర్

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 31: కలలు కనడమే కాదు వాటిని నిజం చేయటం నా బాధ్యతఅంటూ అభివృద్ధి పై బాధ్యత తీసుకున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ బాపట్ల అభివృద్ధి గురించి మాట్లాడే ముందు మీరు కలలు కనలేదని చేయలేకపోయారని ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు రాజకీయ కుటుంబంగా అని చెప్పుకునే మీ పాలనలో నాలుగు రోడ్లు పోసి అభివృద్ధి మాది అనే చెప్పుకునే అలవాటు మీద అయితే.. మీరు చేసిన అభివృద్ధికి 2024లో ప్రజలు ఇచ్చిన తీర్పే దీనికి ప్రశంసలు మీరు ఊహించని అభివృద్ధి మేము అమలు చేస్తున్నాం అభివృద్ధికి అడ్డుకట్టలు వేయాలని చూస్తే సహించేది లేదు ప్రజలు మీ కుటుంబాన్ని నమ్మి ఐదు సార్లు గెలిపించిన బాపట్ల అభివృద్ధి ఎక్కడ అని సూటిగా ప్రశ్నించిన




ఎమ్మెల్యే నరేంద్ర వర్మ బాపట్లలో మీ డబ్బుతో చేసిన అభివృద్ధి మీకే తెలియాలి కానీ నా సొంత నిధులతో చేసిన అభివృద్ధి ప్రజలకే తెలుసు అభివృద్ధితో మాట్లాడటం నా స్టైల్ నీలా  మాటలతో కాదు అంటూ తాము చేస్తున్న అభివృద్ధిపై ప్రజలకు నమ్మకం ఉందనన్న ఎమ్మెల్యే బాపట్ల ను అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని విమర్శలతో వెనక్కి తగ్గేదే లేదని నరేంద్ర వర్మ స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య విభాగం బలోపేతం...ఎమ్మెల్యే నసీర్..



గుంటూరు, పెన్ పవర్, మార్చి, 31. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య చరిత్రలో ఫెర్టిలిటీ విభాగం ఏర్పాటు మైలురాయిగా నిలుస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఫెర్టిలిటీ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే నసీర్ మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు అన్ని జిల్లాలకు వైద్య రంగంలో అత్యంత విలువైన సేవలు అందిస్తున్న గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి పేదలకు వరంగా మారిందని చెప్పారు.  దేశంలో జనాభా అత్యంత విలువైన ఆస్తి అని, మ్యాన్ పవర్ దేశ శక్తిని మార్చగలుగుతుందని అన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి కారణంగా స్త్రీ, పురుషుల్లోనూ సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందని, ఈ కారణంగా ఫెర్టిలిటీకి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు ఇలాంటి గొప్ప సేవలను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే కోట్ల రూపాయలతో జింఖానా సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మాతా శిశు సంక్షేమ విభాగాన్ని ఏర్పాటు చేసిందని, దీని ద్వారా 600 పడకల సామర్థ్యం గల అత్యంత విలువైన సేవలు అందించబోతుందని వివరించారు. ఇప్పుడు సర్టిఫిలిటీ వైద్య సేవల ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేయబోతున్నామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు....

# దళితులు మతం మారితే కులవివక్ష పోతుందా?

గాజువాక : దళితులు క్రైస్తవ మతంలోకి మారితే కుల వివక్ష పోతుందా అని పలువురు వక్తలు ప్రశ్నించారు. క్రైస్తవ మతంలోకి మారిన దళితులకు ఎస్సి హోదా వర్తించదని సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పుపై స్టీల్ప్లాంట్లోని సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుకోటి చిరంజీవి అధ్యక్షతన రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, దళితులు క్రైస్తవమతం తీసుకున్నా, వారిని కులవివక్ష మాత్రం వదలదని, కానీ దళితులు వారి హక్కులు మాత్రం కోల్పోవలసి వస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే ఈ విషయమై సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనానికి వెళ్లాలని, కేంద్రంలోనూ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించి దళితులకు న్యాయం చేయాలని కోరారు.

# పార్లపల్లిలో విపిఆర్ ఫౌండేషన్ 'అమృత ధార' వాటర్ ప్లాంట్ ప్రారంభం





విడవలూరు పెన్ పవర్ మార్చి 31. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 200 వాటర్ ప్లాంట్ల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరు. కోవూరు నియోజకవర్గంలో ఇది 26 వ వాటర్ ప్లాంట్ పార్లపల్లిలో గ్రామంలో 20 నెలల్లో 1 కోటి 2 లక్షలతో అభివృద్ధి పనులు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. రాజకీయాల్లోకి రాకముందు నుంచే తాము ప్రజా సేవకులమని పదవుల కోసం కాకుండా ప్రజలకు మరింత చేరువై సేవ చేయాలన్న ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చామన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అమృత ధార' ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పవిత్ర సంకల్పంతో 2016లో ఉదయగిరిలో ప్రారంభమైన అమృత ధార ప్రస్థానం నేడు జిల్లా అంతటా విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 200 వాటర్ ప్లాంట్ల ద్వారా ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు.

కోవూరు నియోజకవర్గంలో ఇది 26వ ప్లాంట్ అని, దీని నిర్వహణ బాధ్యతను కూడా విపిఆర్ ఫౌండేషనే చూసుకుంటుందని ఆమె హామీ ఇచ్చారు. విడవలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రులు డాక్టర్లు ఉండడం లేదని స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జిల్లా వైద్యాధికారి తో ఫోన్లో మాట్లాడి హాస్పిటల్లో నైట్ షిఫ్ట్ లో డాక్టర్లను కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పార్లపల్లి గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ జల్ జీవన్ మిషన్ ద్వారా 36 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్, 11 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం, 3 లక్షలతో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం చేసిన విషయాన్ని ఆమె తెలిపారు. ఎంపీ లాడ్స్, ఉపాధి హామీ మరియు పంచాయతీ నిధులతో కలిపి మొత్తం 9 సి.సి. రోడ్ల నిర్మాణం చేసామన్నారు.

ఆరగాణి కాలువపై 10 లక్షలతో కల్వర్టు, జూ= నిధులతో స్మశాన వాటికల్లో షెల్టర్ల నిర్మాణం గురించి చెబుతూ ?గడిచిన 20 నెలల పార్లపల్లి గ్రామంలో 1 కోటి 2 లక్షలతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఆమె వివరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న స్మశాన వాటిక భూమి సమస్య పరిష్కారానికి తన వంతుగా రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ముగ్గురు అనారోగ్య బాధితులకు సీఎంర్ఫ్ ద్వారా రూ. 2 లక్షల 76 వేల ఆర్థిక సహాయం అందజేశామన్నారు. 1 కోటి 70లక్షల రూపాయలతో పార్లపల్లి నుండి చవటపాలెం వరకు కనెక్టింగ్ రోడ్డు మరియు కల్వర్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే ఈ పనులను మంజూరు చేయించి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈసందర్భంగా హామీ యిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# కావలిలో మున్సిపాలిటీలో 'షాడో' కమీషనర్ బషీర్ పెత్తనం

## పారిశుధ్య కార్మికులను వేధింపు...
## నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వాహనాల వినియోగం..
## సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు ధ్వజం

కావలి మార్చి 31 పెన్ పవర్ : కావలి మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్స్పెక్టర్ బషీర్ "షాడో" కమీషనర్" లా వ్యవహరిస్తూ, కార్మి కులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు ఆరోపించారు. మంగళవారం స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెందిన చెత్తతరలింపు వాహనాలుబాగున్నప్పటికీ, వాటికి మరమ్మతులు వచ్చాయని సాకు చూపుతూ, పక్కన పెట్టారని నాగరాజు విమర్శించారు. వాటి స్థానంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వాహనాలను వినియోగిస్తూ, ప్రజాధనాన్నిదుర్వినియోగం చేస్తున్నారనిమండి పడ్డారు. చెత్త కంపోస్ట్ యార్డు వద్ద తడి, పొడి చెత్త వేరు చేయడానికి ఒక వాహనం సరిపో తుండగా, కావాలనేరెండు వాహనాలను ఏర్పాటుచేసి,సుమారు 8 మంది కార్మికులను అక్కడ కేటాయి ంచడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో రికార్డుల ప్రకారం దాదాపు 350 మంది కార్మికులు ఉన్నారని, అయితే క్షేత్రస్థాయిలో వంద మంది కూడా పని చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఎక్కువ మందిని అధికారులు, ఇతర ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద పెట్టి, వెట్టి చాకిరీ చేయిస్తున్నాడని ఆరోపించారు. మునిసిపల్ డ్యూటీ చేస్తున్న ఆ కొద్దిమందిపైనే మిగిలిన 300 మంది పని భారాన్ని మోపుతూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 5 గంటల నుంచే విధులకు హాజరయ్యే కార్మికులకు కనీసం సెలవు కూడా ఇవ్వడం లేదు. సెలవు పెడితే వాళ్లను కమిషనర్




దగ్గరికి,ఆర్డిఓ దగ్గరకు తిప్పుతున్నాడని ఆరోపిం చారు ఇటీవల సెలవు జూపేఅఖువఒక వ్యక్తిని ఆర్డిఓ దగ్గరకి తీసుకుపోయి, 20 రూపాయలు స్టాంపు కాగితం మీద తప్పు చేసినట్లుగా రాయించాడని తెలిపారు. అదే ప్రైవేటు వ్యక్తుల వద్ద పనిచేసే వారికి మాత్రం సెలవు మినహాయింపులు ఇస్తున్నారన్నారు. పారిశుధ్య కార్మికులను తరిమేసేం దుకు కుట్ర జరుగుతోంది అని ధ్వజ మెత్తారు. ఈ అక్రమాలన్నీ కమిషనర్‌కు తెలిసి జరుగుతున్నాయా? లేక ఆయన దృష్టికి రాకుండా సాగుతున్నాయా? అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోజరుగుతున్న ఈగందరగోళపరిస్థితిపై పురపాలక శాఖ మంత్రికి త్వరలో ఫిర్యాదుచేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ నియోజక వర్గ సహాయ కార్యదర్శి బోసు, సహచరుడు పసుపులేటి మహేష్ పాల్గొన్నారు.

# ఓంశక్తి అంగన్వాడీ సెంటర్ కార్యకర్త సేవలు భేష్

పలమనేరు,పెన్ పవర్, మార్చి 31, ఓంశక్తి అంగన్వాడీ సెంటర్ కార్యకర్త సేవలు భేష్ అని పిల్లల తల్లిదండ్రులు, గర్భవతులు, బాలింతలు తమ అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు తెలిపారు. మండలం లోని గంగవరం ఓంశక్తి అంగన్వాడీ కేంద్రం నందు సూపర్ వైజర్ పుష్ప ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులు,బాలింతలు మరియు పిల్లల తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈమధ్య పిపిపి(పబ్లిక్ పాసిటివ్ పర్సెప్షన్) పై వచ్చిన కాల్స్ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను తప్పకుండా తెలియచేయాలని కోరారు. ఇక్కడ అంగన్వాడీ సెంటర్ నందు 17మంది గర్భిణీలు,12 మంది భాలింతలు,52 మంది (టి. హెచ్. ఆర్) పిల్లలు, సెంటర్కు వచ్చే 10 మంది పిల్లలు వున్నారు. అలాగే ప్రెగ్నెంట్ మరియు లాక్టేటింగ్ మహిళలకు సరైన సమయానికి మొదటి,రెండవ ఫేజ్‌లో కిట్స్



కూడా వందకు వందశాతం అందిస్తున్నారని లబ్ధిదారులు తెలిపారు. కాకపోతే కొంతమంది లబ్ధిదారుల వద్ద మొబైల్ ఫోన్లు లేకపోవడం వల్ల, మరికొందరు కాల్స్‌కు సరైన స్పందన ఇవ్వలేకపోవడం జరిగిందని విచారణలో తెలిసింది. అయితే మొబైల్ ఫోన్లకు తరచూ ఇతర అనవసర కాల్స్ వస్తున్నాయని,ఇది కూడా అటువంటి కంపెనీ కాల్స్‌గా భావించడం కూడా కారణమని విచారణలో తెలిసిందని,ఇకపై అన్ని రకాల కాల్స్ అందుకొని సమాధానం చెబుతామని అన్నట్లు సూపర్ వైజర్ అన్నారు. స్టాక్ నాణ్యత బాగుందని అంగన్వాడి వర్కర్ సరైన విధంగా పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు తెలిపారు. పిల్లలకు ప్రీ-స్కూల్ యాక్టివిటీస్ మరియు భోజనం సక్రమంగా అందుతున్నాయని చెప్పారు. టాయిలెట్స్ మరియు త్రాగునీటిని పిల్లలు వినియోగి స్తున్నారని తల్లిదండ్రులు తెలియజేశారు. ఇందులో అంగన్వాడీ కార్యకర్త సుజాత మరియు సహాయకురాలు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.





నెల్లూరు పెన్ పవర్ మార్చి 31. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కలివెలపాలెం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. అన్నం పెట్టే రైతు బాగుండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆకాంక్ష. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి రైతు ఎక్కడా నష్టపోకూడదు, ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువనేత మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి క్షేత్రస్థాయిలో రైతులకు ఏ ఇబ్బంది కలగకూడదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులతో నేరుగా మాట్లాడాలనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించడానికి వచ్చాము. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా, రైతులకు అత్యంత గౌరవం ఇచ్చిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ మీద వారి పేరు ఉండేలా, ఎక్కడ పండించిందో తెలిసేలా ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ను ముద్రించి రైతుల శ్రమను భావితరాలకు తెలిసేలా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్ లో రాష్ట్రం మొత్తం మీద 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కూటమి ప్రభుత్వం సేకరించింది. ధాన్యం సేకరించడమే కాదు 24 గంటల్లో రైతు ఖాతాలకు ధాన్యం డబ్బులు జమ చేసి రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. పై కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, క్లస్టర్ ఇంచార్జ్ సారంగం గున్నయ్య, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, కలివేలపాలెం పి.ఎ.సి.ఎస్. సొసైటీ చైర్మన్ చెన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి, జెడ్పి కోఆప్షన్ మెంబర్ అలాబక్షు, టిడిపి నాయకులు వేడిచెర్ల వెంకటేశ్వర్ల యాదవ్, చెన్నారెడ్డి సురేందర్ రెడ్డి, యదనపర్తి శ్రీనివాసులు రెడ్డి , జగదీష్ రెడ్డి, అత్తులూరు ఈశ్వరయ్య, పోతయ్య, హాజరత్, శివప్రసాద్ నాయుడు, షామయ్య,

శ్యాంసుందర్ రెడ్డి, దాసరి వెంకట శేషయ్య, వెంకటరామిరెడ్డి, మురళి రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, కిషోర్ నాయుడు, కామయ్య, జి. మల్లి, నాగులపాటి సురేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, వసంత్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, పెంచల రెడ్డి, చేవూరు రామిరెడ్డి, మురళి కృష్ణ, లేబూరు శంకరయ్య. కిషోర్ నాయుడు యాకసిరి అంజయ్య, కృష్ణయ్య, మధు బాబు, ఎన్. రామకృష్ణ, పి. కిరణ్, కాలేషా, చాంద్ బాషా, షూకూర్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు సమస్యలపై వినతులు

విశాఖ. పెన్ పవర్ ప్రతినిధి మార్చి 31:జివిఎంసి గాజువాక ఆరో జోన్ 71వ వార్డు పరిధిలోని ఆటోనగర్ డి బ్లాక్ తోకాడ గ్రామంలో సర్వే నెంబరు 55/3, 56/2లోగల రోడ్డు సరిహద్దులు గుర్తించి రోడ్డు మార్గానికి సుగమం చేయాలని కోరుతూ కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరికి సోమవారం పలు అపార్టుమెంట్ల వాసులు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను తెలియజేశారు. గాజువాక మండలం తోకాడ గ్రామంలో సర్వే నెంబరు 55/3, 55/2లో ఆటోనగర్ డి బ్లాకు పరిధిలో సమైక్య అపార్ట్‌మెంట్ 95 ఫ్లాట్‌లు, స్వర్ణసాయి రెసిడెన్సీ 50 ఫ్లాట్‌లు, సిరి ఎన్‌క్లేవ్ 20 ఫ్లాట్‌లు, స్వర్ణసాయి ఎన్‌క్లేవ్ 90 ఫ్లాట్‌లు, గ్రీన్‌లైఫ్ అపార్ట్‌మెంట్ ఎ, బి బ్లాకులు 80 ఫ్లాట్లల్లో కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. ఇదే ప్రాంతంలో మరో 50 కుటుంబాల వారూ ఉన్నారన్నారు. వెరసి రెండు వేల మంది జీవిస్తున్నారన్నారు. వారందరూ ఉపయోగించే రోడ్డుకు సరిహద్దులను రెవెన్యూ శాఖ వారు నిర్దేశించినా, ఆక్రమణదారుల గుప్పెట్లో ప్రభుత్వ భూమి (రోడ్డు) ఉందన్నారు. దీనికి సంబంధించి రెవెన్యూ రికార్డుల ప్రకారం సరిహద్దులు గుర్తించి, రోడ్డు మార్గం సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆయా అపార్టుమెంట్ల అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు జె.రామన్న, కెఎస్. చౌదరి, శంకరరావు, గౌరవ్, ఎం.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరాజు, పి.కృష్ణారావు, శివకుమార్, పి.శ్రీనివాసరెడ్డి, శ్రీధరన్, ఆర్.జగన్మోహన్, పిజె.రాముడు, వివిఎల్‌కె.రావు, బి.కోటి రెడ్డి



పాల్గొన్నారు.

భారీ వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు


డి బ్లాక్‌లోని పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయడం వల్ల నివాసుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తక్షణం ఆ సమస్యను పరిష్కరించాలని పై అపార్టుమెంట్ల అసోసియేషన్ నాయకులు వేరొక వినతిపత్రాన్ని జెసికి అందజేశారు. ఇక్కడ నివాసముంటున్న వారంతా రోజువారీ కార్యకలాపాలు, విధులకు, స్కూళ్లు, మార్కెట్లకు, ఇతర పనులకు ఆటో నగర్ డి బ్లాక్ రోడ్డు మార్గం గుండానే ప్రయాణాలు సాగిస్తున్నారని చెప్పారు. అటువంటి ప్రాంతంలో ఎంఆర్ఎఫ్, టాటా స్టీల్ స్ట్రక్చర్, ఇతర ఇండిస్ట్రీలు గొడౌన్స్ నడుపుతూ, వారి కార్యకలాపాలు చేపడుతున్నాయన్నారు. ఈ గొడౌన్స్‌కు వచ్చే భారీ వాహనాల రాకపోకల సమయంలో స్కూలు పిల్లల ఆటోలు, మినీ బస్సులు వచ్చి వెళ్తుంటాయని తెలిపారు. ఆ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తపరిచారు. ఈ విషయాన్ని గొడౌన్స్ యజమానులు, నిర్వాహకులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టడం లేదన్నారు. ఇలా కమిషనర్ దృష్టికీ సమస్యను తీసుకువెళ్లామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఆటోనగర్ డి బ్లాక్‌కు అన్న క్యాంటీన్ పక్క నుంచి రోడ్డు నిర్మించినట్టయితే అటు పరిశ్రమలతో పాటు ఇటు నివాసులకు ఎటువంటి ఇబ్బందులూ ఉండవని భావిస్తున్నామని నాయకులు తెలిపారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.


తారు రోడ్డు పూర్తి కోసం జివిఎంసి కమిషనర్‌కు వినతి

గ్రీన్‌లైఫ్ అపార్టుమెంట్ నుంచి ఆర్‌సిసి ఇంజినీరింగ్ కంపెనీ వరకూ తారు రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉందని, దాన్ని తక్షణం పూర్తి చేయాలని కోరుతూ పై అపార్టుమెంట్ల అసోసి యేషన్ నాయకులు జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్‌కు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇక్కడ తారు రోడ్డు నిర్మాణానికి రూ. 19.67 లక్షలు మంజూరైన విషయాన్ని గుర్తుచేశారు. గత ఏడాది సెప్టెంబర్ 15న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారని తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులను తెలియజేశారు. రోడ్డు ఎందుకు వేయలేదని జివిఎంసి అధికారులను అడిగితే కోర్టు వివాదంలో ఉందని చెబుతున్నారు

# అంగనవాడి సమస్యలు పరిష్కరించాలి...

## అంగన్వాడిలా వేతనాలు పెంపుదలకు ప్రభుత్వం ప్రకటన చేయాలి..
## అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్లపట్ల ప్రాజెక్ట్ అధ్యక్షులు వై.మేరీమణి





నిజాంపట్నం:- పెన్ పవర్ ప్రతినిధి మార్చి 31:అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్.సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్ట్ కార్యాలయలు వద్ద జరుగుతున్న నిరసన ధర్నాలో భాగంగా పల్లపట్ల ప్రాజెక్ట్ ఆఫీసు ముందు బైఠాయించి వేతనాలు పెంపదలు చేయాలని సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపి,సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిడిపిఓ అనసూయ గారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వై. మేరీమణి మాట్లాడుతూ ధరలు పెరుగుతున్న వేతనాలు గత 5 సంవత్సరాల నుండి ఒక్కపైసా కూడా వేతనం పెంచలేదని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంపుదల చేయాలని అన్నారు,ఈ ప్రభుత్వం అంగన్వాడీల వేతనాలు పెంచుతామని చెబుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు అనటం సమంజసం కాదని ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని అన్నారు,రిటైర్డ్ అయిన మధ్యలో మరణించిన వర్తించేలాగా గ్రాడ్యుటీనీ మార్పు చేయాలి,

వేసవికాలంలో మే నెల మొత్తం సెలవులు ప్రకటించాలి,అంగన్వాడీలకు ఇబ్బంది లేకుండా గ్యాస్ సరఫరా చేయాలినీ అన్నారు, ఈ కార్యక్రమంలో పలపట్ల ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకత్వం బేబీ రాణి,దిల్షాద్,రమాదేవి తదితరులు పాల్గొన్నారు

# కొంత నిరాశ ఉంది.. కానీ, బీసీసీఐ తీసుకున్న నిర్ణయం సరైనదే: గంగూలీ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్-ఆస్ట్రేలియా మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీస్ (బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీ) వేదికల ఎంపికపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ స్పందించారు. ఈడెన్ గార్డెన్స్‌లో టెస్టు మ్యాచ్ జరగకపోవడం పట్ల బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనకు కొంత నిరాశ ఉన్నప్పటికీ, బోర్డు తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆయన అభిప్రాయపడ్డారు. "ఒక మాజీ క్రికెటర్‌గా కోల్‌కతాలో మ్యాచ్ జరగాలని నేను కోరుకుంటాను. కానీ, కేవలం సంప్రదాయ వేదికలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ఇతర మైదానాలకూ అవకాశం ఇవ్వడం ముఖ్యం" అని గంగూలీ అన్నారు. గువాహటి, రాంచీ వంటి నగరాల్లో టెస్టులు నిర్వహించడం వల్ల అక్కడి అభిమానులకు మేలు జరుగుతుందని, ప్రస్తుతం దేశంలోని అన్ని స్టేడియాల్లోనూ ప్రపంచ స్థాయి సదుపాయాలు ఉన్నాయని ఆయన చెప్పారు. 2001లో ఈడెన్ గార్డెన్స్‌లో ఆస్ట్రేలియాపై సాధించిన చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకున్న దాదా, ఆనాటి ఆటగాళ్లంతా మళ్లీ ఒక చోట చేరాలని ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించారు. "మేమంతా ఈ నెలలోనే కలవాల్సి ఉంది. అయితే సచిన్ టెండూల్కర్ కుమారుడి (అర్జున్ టెండూల్కర్) వివాహం ఉండటంతో ఆ భేటీని వాయిదా వేశాం. త్వరలోనే ఆ వేడుక ఎప్పుడనేది ప్రకటిస్తాం" అని ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తన కెరీర్‌లో లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పిన నాట్‌వెస్ట్ ట్రోఫీ విజయం కంటే.. కోల్‌కతా, అడిలైడ్, హెడింగ్లేలలో సాధించిన టెస్టు విజయాలే తనకు ఎక్కువ సంతృప్తినిస్తాయని గంగూలీ చెప్పారు. పాకిస్థాన్ తో జరిగిన టెస్టులో సెహ్వాగ్ ట్రిపుల్ సెంచరీ గురించి చెబుతూ... "300 పరుగుల దగ్గర సింగిల్ తీయమని నేను చెప్పినా వినకుండా, వీరూ సిక్స్‌తోనే దాన్ని పూర్తి చేశాడు. త్రిశతకాలు తరచూ రావు, అందుకే అప్పుడు నేను కాస్త కంగారు పడ్డాను" అని నవ్వుతూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం బీసీసీఐ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాగ్‌పుర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్‌లు బోర్డర్-గావస్కర్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

# ధోనీ నా ఫోన్ లిఫ్ట్ చేయడు.. ఆయనకు నాకు మాటలు లేవు






**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ మధ్యలో చెన్నై సూపర్ కింగ్స్ కొత్త, పాత ప్లేయర్స్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక రీయూనియన్ క్యాంపెయిన్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఈ వేడుకలో జట్టులోని దాదాపు అందరూ స్టార్ ఆటగాళ్లు కనిపించగా, జడేజా, ధోనీ ఒకరితో ఒకరు మాట్లాడుకోకపోవడం కెమెరాలలో రికార్డు అయింది. దీంతో వీరిద్దరి మధ్య కోల్డ్ వార్ స్టార్ట్ అయిందా అనే ప్రచారం మొదలయింది. ప్రస్తుతం నెట్టింట ఈ గొడవ తెగ ట్రెండింగ్ అవుతుంది. ఈక్రమంలో ఈ వివాదంపై రవీంద్ర జడేజా మాట్లాడుతూ.. అది కేవలం టెక్నికల్ ఎర్రర్ తప్ప మనస్పర్థలు లేవని స్పష్టం చేయడంతో క్రికెట్ అభిమానులు ఊపరి పీల్చుకున్నారు.

జడేజా మాట్లాడుతూ.. నేను రీయూనియన్‌కు వెళ్లే ముందే 'మహీ భాయ్'కి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నారో అడుగుదామని అనుకున్నా.. కానీ ఆయన ఫోన్ స్విచాఫ్‌లో ఉండటంతో.. వేడుక జరిగే ప్రదేశంలో కూడా చాలా రద్దీగా ఉండటంతో మేమిద్దరం మాట్లాడుకునే ఛాన్స్ రాలేదన్నారు. అంతే తప్ప మా మధ్య ఎలాంటి గొడవలు లేవని నవ్వుతూ ఆన్సర్ ఇచ్చాడు. ధోనీకి ఫోన్ చేయడం కంటే అతడ్ని నేరుగా కలవడమే ఈజీ, ఎందుకంటే ఆయన ఎప్పుడు ఫోన్ వాడుతారో ఎవరికీ తెలియదని రవీంద్ర జడేజా ఫన్నీ కామెంట్స్ చేశాడు. 2022 ఐపీఎల్ సమయంలో కెప్టెన్సీ మార్పుతో జడేజా, ధోనీ మధ్య గొడవలు వచ్చాయని ప్రచారం జరిగింది. కానీ 2023 ఫైనల్‌లో జడేజా ఆఖరి బంతికి ఫోర్ కొట్టి సీఎస్కేని విజేతగా నిలిపిన తర్వాత ధోనీ అతడిని ఎత్తుకుని సెలబ్రేషన్స్ చేసుకోవడంతో ఆ వార్తలకు బ్రేక్ పడింది. ం

ఇప్పుడు మళ్ళీ ఇలాంటి చిన్న చిన్న విషయాలను పెద్దవి చేయవద్దని జడేజా ఫ్యాన్స్ ని కోరాడు. ధోనీ తనకు ఎప్పుడూ గురువు, మార్గదర్శి.. అతనిపై ఉన్న గౌరవాన్ని ఎప్పటికీ తగ్గించనని జడ్డూ తేల్చి చెప్పారు. ఈ రీయూనియన్ వివాదంపై జడేజా క్లారిటీ ఇవ్వడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పాక్ క్రికెటర్లకు కొత్త రూల్.. రాజకీయ పోస్టులు పెడితే కోటి ఫైన్!




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ నసీం షాకు ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) భారీ జరిమానా విధించింది. పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్‌పై సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్ట్ చేసినందుకు గానూ అతడికి 72,000 అమెరికన్ డాలర్లు (పాకిస్థాన్ కరెన్సీలో సుమారు రూ. 2 కోట్లు) ఫైన్ వేసింది. ఈ ఘటన నేపథ్యంలో, కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లందరికీ పీసీబీ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇకపై రాజకీయపరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే... ఇటీవల పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 ప్రారంభ మ్యాచ్‌కు పంజాబ్ సీఎం మరియం నవాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె, ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ కు కూతురు వరుస అవుతుంది. అయితే, నసీం షా సోషల్ మీడియాలో "గడాఫీ స్టేడియంలో ఆమెకు రాణికి ఇచ్చినంత గౌరవం ఎందుకు ఇస్తున్నారు?" అని వ్యంగ్యంగా పోస్ట్ చేశాడు. గల్ఫ్ యుద్ధం కారణంగా దేశంలో నెలకొన్న సంక్షోభం దృష్ట్యా ప్రభుత్వ పొదుపు చర్యల్లో భాగంగా అభిమానులను స్టేడియాల్లోకి అనుమతించని సమయంలో ఒక రాజకీయ నాయకురాలికి ఇంతటి ప్రాధాన్యత ఇవ్వడంపై ఈ పోస్ట్ దుమారం రేపింది. ఈ పోస్ట్‌ను వెంటనే తొలగించి, తన ఖాతా హ్యాక్ అయిందని నసీం షా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశాడు. అయితే, ఈ వాదనను పీసీబీ అంగీకరించలేదు. ఈ నెల 27న అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణ చేపట్టింది. క్రమశిక్షణ కమిటీ విచారణ అనంతరం సెంట్రల్ కాంట్రాక్ట్ నిబంధనలను, సోషల్ మీడియా మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు తేల్చి రూ. 2 కోట్ల జరిమానా విధించింది. నసీం షా బేషరతుగా క్షమాపణ చెప్పినట్లు బోర్డు తెలిపింది. ఈ ఘటనకు బాధ్యుడిగా అతడి సోషల్ మీడియా సలహాదారుడిని కూడా విధుల నుంచి తొలగించి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ఈ నేపథ్యంలో ఆటగాళ్ల సోషల్ మీడియా వినియోగంపై పీసీబీ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. జియో న్యూస్ కథనం ప్రకారం.. ఇకపై బోర్డు మీడియా విభాగం నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి రాజకీయపరమైన పోస్టులు పెట్టరాదని ఆటగాళ్లకు, వారి మేనేజర్లకు స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కనీసం కోటి రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. రాజకీయ పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బోర్డు స్పష్టం చేసింది.

# వారణాసి సినిమాపై ఇంట్రెస్టింగ్ అప్ డేట్!





సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా -వారణాసి- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. చిత్రీకరణ మొదలైన నాటి నుంచి రాజమౌళి అండ్ కో ఎక్కడా గ్యాప్ తీసుకోకుండా పని చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ముందుగా ప్రకటించిన సమయానికే రిలీజ్ చేయాలని కట్టుబడి టీమ్ పని చేస్తోంది. ఈనేపథ్యంలో సినిమాకు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్ డేట్ ఒకటి వెలుగులోకి వచ్చింది. మహేష్ తన పార్ట్ షూటింగ్ ను సెప్టెంబర్ లేదా? అక్టోబర్ కల్లా పూర్తి చేస్తారని తెలిసింది. అనంతరం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పనులు మొదలు పెట్టాలని ప్లాన్ చేసుకుంటున్నారుట. సాధారణంగా రాజమౌళి సినిమాలంటే షూటింగ్ పూర్తి చేయడానికి సమయం తీసుకుంటారు. కానీ -వారణాసి- విషయంలో మాత్రం జక్కన్న పక్కా ప్లానింగ్‌తో షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తున్నారు. ఓవైపు మహేష్ పై సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా మరోవైపు ఇతర పాత్రలకు సంబంధించిన షూటింగ్ కూడా ఏక కాలంలో జరుగుతోంది. కీలక షూట్ లో రాజమౌళి ఉండగా , మిగతా పార్ట్ కు సంబంధించిన షూట్ లో ఆయన టీమ్ పని చేస్తోంది. హీరోపై సన్ని వేశాల చిత్రీకరణ పూర్తయిందంటే మెజార్టీ పార్ట్ షూటింగ్ మొత్తం పూర్తయినట్లే. అప్పటి నుంచి షూటింగ్ పరంగా పెద్దగా ఫోకస్ చేయాల్సిన పని తగ్గుతుంది. సెట్ లో రాజమౌళి ఉన్నా? లేకపోయినా ఆయన టీమ్ మిగతా పనుల్ని సునాయాసంగా పూర్తి చేస్తుంది. అలాగే రాజమౌళి ప్రతి సినిమాకు విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక విభాగాలకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. అయితే -వారణాసి- విషయంలో షూటింగ్‌తో పాటు సమాంతరంగా సాంకేతిక పనులను కూడా పూర్తి చేసేలా టీమ్ ప్లాన్ చేస్తోంది. మహేష్ బాబు షూటింగ్ పూర్తి చేసిన తర్వాత సినిమాను పూర్తి స్థాయిలో ఆవిష్కరించేందుకు కావాల్సిన సమయాన్ని రాజమౌళి తెలివిగా సద్వినియోగం చేసుకుంటారు.

ఇలా చేయడం వల్ల -వారణాసి- అనుకున్న సమయానికి విడుదల కావడానికి ఎంతో దోహదపడుతుంది. ఈ చిత్రాన్ని గ్లోబల్ స్థాయిలో రిలీజ్ ప్లాన్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ఏకంగా 120 దేశాల్లో రిలీజ్ చేస్తున్నారు. ఒకేసారి ఇన్ని దేశాల్లో రిలీజ్ చేయడం అన్నది చిన్న టాస్క్ కాదు. రిలీజ్ కు సంబంధించి గ్లోబల్ స్థాయిలో పెద్ద పెద్ద ఏజెన్సీలు, పంపిణీ సంస్థలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. అందుకు కూడా సమయం ఎక్కువగానే పడుతుంది. అయితే రాజమౌళి లాంటి లెజెండ్ కు అదేం పెద్ద పని కాదు. ఆస్కార్ తో అంతర్జాతీయంగా తనకున్న గుర్తింపుతో అనుకున్న గొప్పగా పాన్ వరల్డ్ లో రిలీజ్ చేస్తారు.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965